

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


ఐదు నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

4

కర్ణాటకలో మామిడి ధరలపై

**జగన్ అబద్ధాలు**

- మంత్రి మండిపల్లి మండిపాటు

4

# ఢిల్లీకి సీఎం చంద్రబాబు



- 15, 16 తేదీల్లో రెండు రోజుల పర్యటన
- షా సహా పలువురు కేంద్ర మంత్రులతో భేటీలు
- రాష్ట్ర ప్రాజెక్టులు, నిధులపై చర్చించనున్న సీఎం
- మాజీ ప్రధాని పీవీ సంస్మరణ సభలో ప్రసంగం
- సీఐఐ బిజినెస్ మీట్‌కు హాజరుకానున్న చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): సీఎం చంద్రబాబు రెండురోజులు ఢిల్లీలో పర్యటించనున్నారు. 15,16 తేదీల్లో దేశ రాజధాని ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అవుతారు. అలాగే, ఇతర కార్యక్రమాలకూ హాజరుకానున్నారు. రాష్ట్రంలో చేపడుతోన్న వివిధ ప్రాజెక్టులు, కేంద్ర గ్రాంట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రంతో చర్చించనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, మంత్రులు అశ్వినీ వైష్ణవ్, సీఆర్ పాటిల్, మన్సుఖ్ మాండవీయ, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ తదితరులతో సీఎం భేటీ కానున్నారు. రాష్ట్రంలో చేపట్టిన ప్రాజెక్టులు, వాటికి అవసరమైన నిధులు, పోలవరం– బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా వేర్వేరు అంశాలపై సీఎం కేంద్రమంత్రులతో చర్చించనున్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన పనుల గురించీ ఆయా మంత్రిత్వశాఖతో సీఎం చర్చలు జరుపనున్నారు. 15న ఉదయం అమరావతి నుంచి ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మధ్యాహ్నం కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో భేటీ అవుతారు. అదే రోజు కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్, ఢిల్లీ మెట్రో రైల్ ఎండీలతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం కానున్నారు. సాయంత్రం 4.30కు ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం లైబ్రరీలో జరుగనున్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సంస్మరణ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. 16న కేంద్ర కార్మిక ఉపాధి కల్పనా మంత్రి మన్సుఖ్ మాండవీయతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. అనంతరం నార్త్ బ్లాక్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించే బిజినెస్ కాన్ఫరెన్స్‌కు ముఖ్యమంత్రి హాజరవుతారు. 17న ఉదయం 9.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీనుంచి అమరావతికి బయలుదేరుతారు.

### స్వర్ణాంధ్ర సాధనకు

## సర్వేక్షణ్ అవార్డులే స్ఫూర్తి

*- సాధకులకు అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు*

అమరావతి (చైతన్యరథం): స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో 2024-25కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ పనితీరు కనబరిచిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. 'అవార్డుల సాధనకు కారణమైన మున్సిపల్ శాఖ, కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు, పారిశుధ్య కార్మికులు, పౌరులకు అభినందనలు. విజయవాడ, గుంటూరు తిరుపతి ప్రతి ష్టాత్మక సూపర్ స్వచ్ఛ లీగ్‌లో చేరాయి. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ కేటగిరీ కింద మినిస్టీరియల్ అవార్డు గెలుచుకుంది. రాజమహేంద్రవరం రాష్ట్రస్థాయి మినిస్టీరియల్ అవార్డు అందుకుంది. ఈ అవార్డులు రాష్ట్ర ప్రజల భాగస్వామ్యంతో పాటు సమష్టి కృషితో అందుకున్నాం. స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర మిషన్ సాధనకు ఈ అవార్డులు మరింత స్ఫూర్తినిస్తాయి' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## మామిడిపై వైసీపీ అనవసర రాద్ధాంతం



- 80 శాతం పంటను కొనుగోలు చేసిన ప్రభుత్వం
- మామిడి పండ్లు రోడ్లపై పోసి బురదజల్లే యత్నం
- రైతులపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో పోరాడాలి
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి

2



## భూముల రీ సర్వేలో పేర్లు తారుమారు

- న్యాయం చేయాలని బాధితుల వినతి

- వినతులు స్వీకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సెంట్రల్ జనరల్ సెక్రటరీ ప్రభాకర్ చౌదరి

3

## ఉగ్రవాదుల్లా పేట్రేగిపోతున్నారు

- బియ్యం దొంగ పేర్ని నాని విద్వేష వ్యాఖ్యలు
- వైసీపీ నాయకులపై మంత్రి సవిత ఆగ్రహం

4

## 590 మంది వేద పండితులకు నిరుద్యోగ భృతి

- దుర్గగుడికి మరో రోడ్డు మార్గానికి టీటీడీ సహకారం కోరాం
- దేవాదాయ మంత్రి ఆనం వెల్లడి

2

## చీకట్లో నరికేయమంటే...దేనికి సంకేతం?



- వైసీపీ నేత పేర్ని వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బోడె, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ ఫైర్
- జగన్ బాటలోనే నేతలు, కార్యకర్తలు
- వైసీపీ డీఎన్ఏలోనే హింస, ఉన్మాదం
- అవినీతి సొమ్ముతో విర్రవీగుతున్న పేర్ని

3

నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు..

## పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- విశాఖ, తిరుపతి, విజయవాడ కేంద్రాల్లో అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ ద్వారా ఇప్పిస్తాం: మంత్రి డోలా

4

# మామిడిపై వైసీపీ అనవసర రాద్ధాంతం

- 80 శాతం మామిడి పంటను కొనుగోలు చేసిన ప్రభుత్వం
- మామిడి పండ్లు రోడ్లపై పోసి బురదజల్లే యత్నం
- రైతులపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీలో పోరాడాలి
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

గంగాధర నెల్లూరు (చైతన్యరథం): మామిడి రైతుల విషయంలో వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తప్పుబట్టారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం మామిడి దిగుబడి రెండు రెట్లు పెరిగిందని చెప్పారు. అయితే ఇప్పటికే రైతులు పండించిన పంటను 80 శాతం మేర కొనుగోలు చేసినట్లు మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. మామిడి రైతుల సమస్యలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పరిష్కరిస్తోందన్నారు. వైసీపీ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి మాత్రం రైతులను అడ్డం పెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మంత్రి గొట్టిపాటి విమర్శించారు. రైతులు పండించిన పంటను రోడ్లపై పోసి, ట్రాక్టర్లతో తొక్కించి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని స్పష్టం చేశారు.

**హామీలు అమలు చేస్తున్నా బురదజల్లుతున్నారు**

శనివారం నాడు సహచర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక



శాసనసభ్యులు థామస్ తో కలిసి చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటించారు. తొలుత ఇరువురు మంత్రులు స్థానికంగా అన్న క్యాంటీన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అనంతరం సుమారు రూ. 20 లక్షలతో నెల్లేపల్లి గ్రామంలో ఎంపీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అదే గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ క్రమంలో మీడియాతో మాట్లాడిన మంత్రి గొట్టిపాటి మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రతీ హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే దీపం పథకం కింద ఉచితంగా మూడు సిలిండర్లను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ గుర్తు చేశారు. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా తల్లికి వందనం పథకం కోసం ఒక్కరోజే తల్లుల ఖాతాల్లో సుమారు రూ. 10 వేల కోట్లు జమ చేశామని అన్నారు. అధికారంలోకి వచ్చిన 13 నెలల్లో హామీలన్నింటినీ అమలు చేస్తుంటే.. వైసీపీ నాయకులు మాత్రం కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

**పరామర్శల పేరిట విధ్వంసం**

వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి నెలకోసారి తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి పరామర్శల పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నారని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి బయటకు వచ్చిన ప్రతిసారి కార్ల కింద కార్యకర్తలను, ట్రాక్టర్ల కింద రైతులు పండించిన పంటను తొక్కిస్తున్నాడని విమర్శించారు. వైసీపీ నాయకులు చేస్తున్న కుట్రలను ప్రజలు గమనించాలని కోరారు. వైసీపీ నాయకులకు, ఎమ్మెల్యేలకు రైతుల మీద ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా సరే 11 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చి ప్రజల తరపున పోరాడాలని మంత్రి గొట్టిపాటి సవాల్ విసిరారు. గతంలో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేల సంఖ్య తక్కువైనా సరే ప్రజల తరపున పోరాడిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.

## వైద్యారోగ్య శాఖ పరిధిలో వాహనాల ఖర్చెంత?

- వివరాలందజేయాలని ఆదేశించిన మంత్రి సత్యకుమార్

అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వంలో అతి పెద్ద శాఖైన వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ పరిధిలో వాడుతున్న ప్రభుత్వ వాహనాల సద్వినియోగంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టి సారించారు. వివిధ శ్రేణుల్లో లక్షకు పైగా ఉన్నతాధికారులు, ఇతర సిబ్బందితో పనిచేసే ఈ శాఖలో ఏడాదికి వాహనాల వినియోగంపై ఎంత ఖర్చవుతుందో తెలపాలని మంత్రి ఆదేశించారు.



మంత్రిత్వ శాఖ సెక్రటేరియట్‌తో పాటు, మరో 10 విభాగాల్లో అధికార విధుల నిర్వహణకు వాహనాలను ప్రభుత్వం సమకూరుస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 4 జోనల్ కార్యాలయాలు, 52 మంది జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణలో క్షేత్ర స్థాయిలో పలు ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయి. దాదాపు 1700 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పీహెచ్‌సీలు), 242 సెకండరీ ఆసుపత్రులు(జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు), 40 వైద్య కళాశాలలు... వీటి అనుబంధ బోధనాసుపత్రులు, ఇతర స్పెషాలిటీ ఆసుపత్రులు...వీటికి సంబంధించిన వైద్యులు, ఇతర సిబ్బంది పనిచేస్తుంటారు. ప్రధానమైన జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) పరిధిలోనే దాదాపు 30 వేల మంది అధికారులు, ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. దాదాపు 40 ఆరోగ్య పథకాలు క్షేత్ర స్థాయిలో అమలవుతున్నాయి. వివిధ అవసరాల నిమిత్తం అధికారిక వాహనాల వినియోగం భారీగా ఉంటుంది.

కొన్ని చోట్ల అవసరాల మేరకు వాహనాల లభ్యత లేకపోవడం, మరికొన్ని చోట్ల వాహనాల దుర్వినియోగంపై సమాచారం వచ్చిన నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ విషయంపై దృష్టి సారించారు.

**మంత్రి అడిగిన వివరాలు**

ఈ నేపథ్యంలో మంత్రిత్వ శాఖ పరిధిలో అధికారులు, ఇతర సిబ్బందికి వాహనాల కేటాయింపు, వినియోగానికి సంబంధించిన నియమాలేంటి, వాటి మేరకు మొత్తం ఎన్ని వాహనాల్ని వాడుతున్నారు, వాటిపై సాలీనా ఎంత ఖర్చవుతుంది వంటి వివరాల్ని వారంలోజుల్లోగా తెలపాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

సెక్రటేరియట్‌తో పాటు వివిధ విభాగాల ఆధీనంలో చేస్తున్న ఖర్చుల వివరాలు, రోజంతా వినియోగం కోసం వాహనాలు కేటాయించిన అధికారుల వివరాలు, ఇతర అధికార విధుల నిమిత్తం వినియోగిస్తున్న వాహనాల సంఖ్య, క్షేత్ర స్థాయి విధుల కోసం వాడుతున్న వాహనాల సంఖ్య, వీటిపై సాలీనా జరుగుతున్న ఖర్చుల వివరాల్ని మంత్రి అడిగారు.

2023-24, 2024-25 సంవత్సరాల్లో జరిగిన వ్యయ వివరాల్ని తెలపాలని మంత్రి కోరారు.

వీటితోపాటు..వాహనాల దుర్వినియోగాన్ని అరికట్టడానికి అమలులో ఉన్న నియమాలు, దుర్వినియోగాన్ని గుర్తించిన సంఘటనలు, తీసుకున్న చర్యల వివరాల్ని కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ అడిగారు.

అధికారిక వాహనాల వినియోగంపై సమగ్రంగా పరిశీలించి, అవసరం మేరకు చేపట్టాల్సిన సంస్కరణలపై కూడా ప్రతిపాదనల్ని తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

## ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శివకుమార్‌కు మంత్రి మండిపల్లి పరామర్శ

- రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేత



చిత్తూరు (చైతన్యరథం): చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో ఇటీవల వైసీపీ రౌడీ మూకల దాడిలో గాయపడి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై శివకుమార్‌ను రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పరామర్శించారు. ఆర్థిక సాయం కింద రూ.2 లక్షల చెక్కు అందజేశారు. ఇప్పటివరకు నిర్వహించిన వైద్య పరీక్షలు, అందుతున్న చికిత్స గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. శివకుమార్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. దీనిపై మంత్రి మండిపల్లి మాట్లాడుతూ వైసీపీ నాయకుల ప్రోద్బలంతో దాడి జరిగిన విధానం గురించి శివకుమార్ వివరిస్తుంటే చాలా బాధ కలిగిందన్నారు. నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికలపై, మీడియా ప్రతినిధులపై ఈ తరహా దాడులను సహించేది లేదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. శివకుమార్‌పై దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. మీడియా హక్కులను కాపాడే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.

# 590 మంది వేద పండితులకు నిరుద్యోగ భృతి

- దుర్గగుడికి మరో రోడ్డు మార్గానికి టీటీడీ సహకారం కోరాం
- దేవాదాయ మంత్రి ఆనం వెల్లడి

తిరుమల (చైతన్యరథం): రాష్ట్రంలో 590 మంది వేద పండితులు నిరుద్యోగులుగా ఉన్నారని.. వారికి నెలకు రూ.3 వేల భృతి ఇవ్వాలని నిర్ణయించినట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), దేవాదాయశాఖ శనివారం సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. సంయుక్త సమావేశంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఇతర అధికారులతో సమీక్షించి తీసుకున్న నిర్ణయాలను మంత్రి ఆనం వివరించారు. గతంలో సీఎం చంద్రబాబు దగ్గర జరిగిన సమావేశంలో ఆలయాలకు సంబంధించిన కొన్ని సమస్యలు ముందుకు వచ్చాయి. వాటిపై సంయుక్తంగా చర్చించుకుని రావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో టీటీడీ ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో, దేవాదాయ శాఖ అధికారులతో కలిసి ఈ సమావేశం నిర్వహించాం. దేవాదాయ చట్టం ప్రకారం 9 శాతం కామన్ గుడ్ ఫండ్ టీటీడీ నుంచి తీసుకోవాలని నిబంధనలు ఉన్నాయి. గతంలో 5 శాతం ఉన్న దానిని 9



శాతానికి పెంచాం. రాష్ట్రంలో అర్చక నిరుద్యోగులుగా ఉన్న అర్చక స్వాములకు భృతి ఇవ్వాలని మేనిఫెస్టోలో ఉందన్నారు. ఆ మేరకు రాష్ట్రంలో 590 మంది వేద పండితులు నిరుద్యోగులుగా ఉన్నారని.. వారికి 3 వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా రాష్ట్రంలోని పునర్నిర్మాణంలో ఉన్న ఆలయాలకు రూ.147 కోట్లు విడుదల కాకుండా నిలిచిపోయాయన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా మరో రూ.11 కోట్ల నిధులు మిగతా ఆలయాలకు రావాల్సి ఉందని తెలిపారు. వీటన్నింటిపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని బోర్డు, అధికారులు చెప్పారని మంత్రి వెల్లడించారు.

విజయవాడ దుర్గ గుడికి వెళ్లేందుకు మరో రోడ్డు మార్గం వేసేందుకు టీటీడీ సహకారం కావాలని కోరాం. టీటీడీలో అన్యమతస్థులు ఉండేది వాస్తవమని స్పష్టం చేశారు. టీటీడీలో వెయ్యి మంది అన్యమతస్థులు ఉన్నారన్న కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై విచారణ కొనసాగుతోందన్నారు. టీటీడీ కాలేజీ, పాఠశాలల్లో ఉన్న 192 పోస్టులను ఒప్పంద లెక్చరర్లతో భర్తీ చేసేందుకు చర్చించినట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.

దేవాదాయశాఖకు సంబంధించిన ప్రక్షాళన తిరుమల నుంచే ప్రారంభం కావాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి ఆనం తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు అన్ని ఆలయాల్లో ప్రశాంతమైన వాతావరణంలో భక్తులకు దర్శనాలు చేయిస్తామన్నారు. ఇప్పటికే కామన్ గుడ్ ఫండ్ నుంచి 200 ఆలయాల పునర్ నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చాం. 300 ఆలయాలకు ధూప దీప నైవేద్యాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు.

# భూముల రీ సర్వేలో పేర్లు తారుమారు

- న్యాయం చేయాలని బాధితుల వినతి
- పలు సమస్యలపై టీడీపీ కేంద్ర కార్యాలయానికి పోటెత్తిన అర్జీదారులు
- వినతులు స్వీకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, సెంట్రల్ జనరల్ సెక్రటరీ ప్రభాకర్ చౌదరి



అమరావతి (చైతన్యరథం): గతంలో జరిగిన రీ సర్వేలో ఆన్ లైన్‌లో పేర్లను తారుమారు చేసి తమ భూములను మరొకరి పేర్ల పైకి ఎక్కించారని.. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన పాసిలి శివసత్యనారాయణ, కరక వెంకట అప్పారావు, తదితరులు టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీని వెనుక వీఆర్వో హస్తం ఉందని, అతనిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పార్టీ సెంట్రల్ జనరల్ సెక్రటరీ వైకుంఠం ప్రభాకర్ చౌదరిలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు. వివిధ సమస్యలపై తరలివచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన నేతలు వాటి పరిష్కారానికి కృషి చేశారు.

కృష్ణా జిల్లా గన్నవరం మండలానికి చెందిన ఓ బాధితురాలు అభ్యర్థిస్తూ.. తనకు ఎవరూ లేరని నమ్మించి పెళ్లిచేసుకొని కొన్ని నెలలు కాపురం చేశాక.. ఊర్లో పని ఉందని చెప్పి అరుణ్ కుమార్ అనే వ్యక్తి జార్ఖండ్ వెళ్లిపోయి, అక్కడి నుండి తనను బెదిరిస్తున్నాడని.. అతనిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఆర్డీఏ పొజిషన్ సర్టిఫికెట్ తెచ్చుకున్నా... ఇద్దరు వ్యక్తులు అనవసరంగా తమపైకి గొడవకు వస్తూ కేసులు పెడుతున్నారని.. తమ భూమిని రీ సర్వే చేయించి తమ సమస్యను పరిష్కరించాలని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామానికి చెందిన కోటా శ్రీనివాసరావు గ్రీవెన్స్‌లో నేతలను అభ్యర్థించారు.

ప్రకాశం జిల్లా మార్కాపురం మండాలనికి చెందిన కాశమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తన భర్త చనిపోయాక.. తనకు సంక్రమించిన ఆస్తికి కొందరు దొంగ డాక్యుమెంట్స్ సృష్టించి తనను ఇబ్బంది పెడుతున్నారని.. దొంగపట్టాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం కూనపరాజు పర్వకు చెందిన గురజాల రవికిరణ్ విజ్ఞప్తి చేస్తూ.. తమ పొలంలో కొంతమంది అక్రమంగా మట్టి తవ్వి పెద్ద పెద్ద గుంతలు పెట్టారని.. అక్రమంగా మట్టిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.







# చీకట్లో నరికేయమంటే...దేనికి సంకేతం?

- వైసీపీ నేత పేర్ని వ్యాఖ్యలపై ఎమ్మెల్యే బోడే, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ ఫైర్
- జగన్ బాటలోనే నేతలు, కార్యకర్తలు
- వైసీపీ డీఎన్ఏలోనే హింస, ఉన్మాదం
- అవినీతి సొమ్ముతో విర్రవీగుతున్న పేర్ని



అమరావతి (చైతన్యరథం): చీకట్లో నరికేయండి.. అంటూ వైసీపీ నేత పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతమని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొడే ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పాతరేసేందుకు వైసీపీ శ్రేణులు కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రజాప్రతినిధులు చేసే చిన్న పొరపాట్లు సహా, ప్రతి పనినీ ప్రజలు నిశితంగా గమనిస్తారన్నారు. తప్పు జరిగితే క్షమించను అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారని గుర్తు చేస్తూ..వైసీపీ నేతలు మాత్రం విధ్వంసమే ఏకైక లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. రెంటపాళ్ల పర్యటనలో వైసీపీ పార్టీ కార్యకర్త రప్పా.. రప్పా.. అని ప్లకార్డు పట్టుకుంటే.. మీడియా ముందే దానిని సమర్థించారంటే జగన్ రెడ్డి మానసిన పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. ఒక పార్టీ అధ్యక్షుడిగా, మాజీ సీఎంగా ప్రజాప్రతినిధులకు జగన్ రెడ్డి ఇచ్చే స్ఫూర్తి ఇదేనా అని ప్రశ్నించారు. చీకట్లో కన్ను కొట్టి.. తలలు నరికేయండి.. అని కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షుడు పేర్ని నాని విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. అభివృద్ధి, సంక్షేమం చేసి ప్రజల మన్ననలు పొందాలని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతూ ఉంటారు. వైసీపీ వారు మాత్రం హత్యలు చేయండి.. తలలు నరకండి.. అని చెప్తున్నారంటే వారి పార్టీ ఆలోచనలు, నాయకుల మానసిక పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ఎమ్మెల్యే బోడే విమర్శించారు.

## అవినీతి సొమ్ముతో విర్రవీగుతున్న పేర్ని

హింస, విధ్వంసం, వైసీపీ పాలసీ అనేది పేర్ని నాని వ్యాఖ్యల ద్వారా మరోసారి స్పష్టమైంది. రప్పా రప్పా నరికేస్తాం... అనేది వైసీపీ తీసుకువచ్చిన రాజారెడ్డి రాజ్యాంగం. కూటమి ప్రభుత్వంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు అవుతోంది. రేషన్ బియ్యం, అక్రమ మైనింగ్, భూ దందాలతో పోగేసిన అవినీతి సొమ్ముతో పేర్ని నాని రెచ్చిపోతున్నాడు. ఇలా విర్రవీగినందుకే జనం గట్టిగా బుద్ధి చెప్పారు. గత ఎన్నికల ఫలితాలను ఒకసారి గుర్తు చేసుకువాలి. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో మచిలీపట్నం బీచ్ రోడ్డులో పూరి గుడిసెలకు నిప్పు పెట్టడం.. ప్రజారక్షణ కోసం పని చేస్తున్న పోలీస్ స్టేషన్‌పై దాడి చేయటం నిజమా..కాదా? రప్పా.. రప్పా అని టీవీల ముందు కాదు, మచిలీపట్నంలో నువ్వు అక్రమించిన వెయ్యి గజాల తమ్మిన వారి సత్రం దగ్గరకు కానీ, నువ్వు కబ్జా చేసిన కోటా జయరాం పొలం వద్దకు కానీ, రంగనాయక స్వామి గుడి దగ్గరకు కానీ వెళ్తే నీ రప్పా.. రప్పా.. సంగతి అక్కడి స్థానికులు తేల్చి, నీకు తగిన విధంగా బుద్ధి చెబుతారని పేర్ని నానిపై ఎమ్మెల్యే బోడే విరుచుకుపడ్డారు.

## జగన్ దారిలోనే నేతలు, కార్యకర్తలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోంది. గత ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో.. ప్రజలందరూ గ్రహించి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక వైసీపీ నేతలు హింసను ప్రోత్సహిస్తున్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా ప్రజలకు అందజేస్తున్నందుకు కూటమి నేతలను నరకాలా? వైసీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలపై ప్రజలందరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. సాక్షి మీడియా ఎవరిదనేది ప్రజలందరికీ తెలుసు.. అదే ఛానల్ రాజధాని అమరావతి మహిళల మీద మురికి వ్యాఖ్యలు చేస్తే.. జగన్ రెడ్డి కనీసం స్పందించిన పాపాన పోలేదు. పొదిలిలో మహిళల మీద దాడి చేయించారు. అంతే కాకుండా నెల్లూరు జిల్లాలో వరుసకు సోదరి అయ్యే కోవూరు మహిళా ఎమ్మెల్యేపై మాట్లాడేందుకు కూడా వీలు లేని మాటలతో వైసీపీ నేత, అక్కడి మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి అవమానించారు. సొంత చెల్లిని ఇంటి నుంచి గెట్టేసి.. ఆమె కట్టుకున్న చీర మీద కామెంట్లు చేసే పరిస్థితుల్లో జగన్ రెడ్డి ఉన్నాడంటే.. వారి పార్టీలో నాయకులు, కార్యకర్తలు కూడా అదే మానసికస్థితిలో ఉంటారు. అఖరికి సమాజాన్ని సరైన దారిలో నడిపే మీడియాపై కూడా దాడి చేయటం దారుణమని ఎమ్మెల్యే బోడే తప్పుబట్టారు.

## బందరును దోచుకున్న పేర్ని: కొనకళ్ల

ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ గత ఎన్నికల ఫలితాల్లో జగన్ మోహన్ రెడ్డి నిరంకుశ, అవినీతి పరిపాలనకు ప్రజలు గుణపాఠం చెప్పి.. ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా.. ఘోరంగా ఓడించారన్నారు. చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వానికి అఖండ మెజార్టీతో అధికారం కట్టబెట్టారు. ఓడిపోయిన అవమానంతో, అక్కసుతో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. రప్పా.. రప్పా, చీకట్లో కన్ను కొడితే పని అయిపోవాలి, తలలు లేచిపోవాలని వైసీపీ నేత పేర్ని నాని చేసిన వ్యాఖ్యలు దేనికి సంకేతం? మాజీ మంత్రిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని ప్రజాస్వామ్యయుతంగా మాట్లాడాలి. కానీ, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం దారుణం. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం మాత్రమే నడుస్తోంది. సీఎం చంద్రబాబు సారథ్యంలో ఉన్న కూటమి ప్రభుత్వం హింసను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించదు. గత ప్రభుత్వంలో జగన్ రెడ్డి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసి రాష్ట్రాన్ని అవినీతిమయంగా, అరాచకంగా మార్చారు. గతంలో టీడీపీ నాయకులు కార్యకర్తలపై దాడులు చేసి, హత్యలు చేశారు. అది మీ సంస్కృతి. అందుకే ప్రజలు మీకు తగిన గుణపాఠం చెప్పారు. పేర్ని నాని మీద బందరులో ఎన్ని అభియోగాలు ఉన్నాయి. ఎన్నో నేరాలు చేశాడు. అడ్డగోలుగా దోపిడీకి పాల్పడ్డాడు. గోడౌన్‌లో రేషన్ బియ్యం ఎక్కడికి పోయాయి. పేర్ని నాని తండ్రి ఎంతోకాలం రాజకీయాల్లో ఉన్నా ఎనాడూ హింసను ప్రోత్సహించే విధంగా మాట్లాడలేదు. కానీ నేడు పేర్ని నాని ప్రవర్తన, ధోరణి వాళ్ల నాయకుడు మెచ్చుకునే విధంగానే ఉంది. హింసను ప్రోత్సహించి.. పరుష పదజాలంతో వేరే పార్టీ వారిని తిడితే వాళ్ల నాయకుడికి ఆనందం. గతంలో జగన్‌రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో పాదయాత్ర చేస్తే అప్పటి సీఎం చంద్రబాబు.. ఎక్కడా ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయించారు. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రం మా యువ నాయకుడు నారా లోకేష్ యువగళం పేరుతో పాదయాత్ర చేస్తే అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. మేము అధికారంలోకి వస్తే ప్రస్తుతం కంటే మంచి పాలన సాగిస్తామని చెప్పాలే కానీ, బెదిరింపు మాటలతో ప్రజలను భయభ్రాంతులను చేయడం వల్ల ప్రయోజనం ఉండదని కొనకళ్ల హితవు పలికారు.

# ఇళ్ల స్థలాల పంపిణీకి అర్హుల జాబితా సిద్ధం చేయండి

**అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం - రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష**

నిమ్మాడ (చైతన్యరథం): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి స్థలాన్ని సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ అంశాలపై నందిగాం మండలానికి సంబంధించి పలాస, టెక్కలి మండలాల రెవెన్యూ అధికారులతో శనివారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం గృహ నిర్మాణలే అవుట్లలో ఎంతమంది లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకున్నారు, నిర్మాణం జరపవలసిన లబ్ధిదారుల వివరాలపై ప్రశ్నించగా నందిగాం మండలంలోని లే అవుట్ లో 1453 గృహాలు అర్హులకు మంజూరు చేయగా 236 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారని, 1021 ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సొంతింటి కల సాకరానికి అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలనే దృఢనిశ్చయంతో ఉన్నట్లు స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను సమగ్ర ప్రణాళికతో సిద్ధం చేయాలని టెక్కలి, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎం.కృష్ణ మూర్తి, వెంకటేష్‌లను ఆదేశించారు. త్వరలో పంపిణీ చేసేందుకు వీలుగా అర్హుల జాబితాను తయారు చేయాలని చెప్పారు. ఇళ్ల స్థలాల లే అవుట్‌లను స్వయంగా వెళ్లి పరిశీలించాలని సూచించారు. ప్రణాళికా బద్ధంగా ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహసీల్దార్లు పాల్గొన్నారు.



# ఉగ్రవాదుల్లా పేట్రేగిపోతున్నారు

**బియ్యం దొంగ పేర్ని నాని విద్వేష వ్యాఖ్యలు - వైసీపీ నాయకులపై మంత్రి సవిత ఆగ్రహం**



పెనుకొండ (చైతన్యరథం): వైసీపీ నాయకులు ఉగ్రవాదుల్లా పేట్రేగిపోతున్నారని, నరకండి, చంపండి అంటూ ఆ పార్టీ కార్యకర్తలను ప్రజలపైకి ఉసిగొల్పుతున్నారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. రేషన్ బియ్యం దోచేసి పేదల కడుపుకొట్టిన ఘనుడు పేర్ని నాని అని ఆగ్రహం వ్యక్తంచేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. అయిదేళ్ల పాటు పాలన సాగించిన వైసీపీ నాయకులు అధికారం శాశ్వతం కాదన్న సత్యాన్ని తెలుసుకోకుండా చట్టాలను, నిబంధనలను అతిక్రమించి అక్రమ సంపాదనకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆనాటి అక్రమాలు బయటపడుతుండడంతో, వారి వెన్నులో వణుకు పుడుతోందన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే అక్రమాలకు పాల్పడిన వైసీపీ నాయకులు భయపడుతున్నారు. జైలుకెళ్లాల్సి వస్తోందనే భయంతో కూటమి ప్రభుత్వంపైనా, అధికారులపైనా, ప్రజలపైనా కక్ష పెంచుకున్నారు. ఒక్క ఛాన్స్ అంటూ ప్రజల కాళ్లవేళ్లా పడి అధికారంలోకి వచ్చిన తరవాత దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీని గత ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే ప్రజలు చేశారన్నారు. దీంతో ఉగ్రవాదుల్లా పేట్రేగిపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రప్పా...రప్పా ...అని ఒకడు నరికేస్తామంటుంటే, చీకట్లో కన్నుకొడితే పని అయిపోవాలి..అని మరొకడు అంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరికి ఆ పార్టీ అధినేత జగన్ కూడా రప్పా రప్పా నరుకుతామంటే తప్పేముంది.. అని అంటున్నాడన్నారు. దళితుడైన సొంత పార్టీ కార్యకర్తను కారు కింద వేసి తొక్కించాదన్నారు. పేదల కడుపుకొట్టి రేషన్ బియ్యం దోచేసిన వైసీపీ నాయకుడు పేర్ని నాని కూడా నోరు పారేసుకుంటున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. పౌరసరఫరాల సంస్థకు అద్దెకు ఇచ్చిన గోదాములో నిల్వ ఉంచిన 4 వేల రేషన్ బియ్యం బస్తాలను పేర్ని నాని మాయం చేశాదని, ఇదే విషయమై కోర్టులో కూడా కేసు నడుస్తోందని తెలిపారు. మరో వైసీపీ నాయకుడు మహిళా ఎమ్మెల్యేను దుర్భాషలాడాదన్నారు. ఆ పార్టీ నాయకులంతా తమ స్వార్థ రాజకీయాల కోసం వైసీపీ కార్యకర్తలను పావులా వాడుకుంటున్నారన్నారు. ఇటువంటి వ్యక్తుల మాటలు నమ్మితే నష్టపోయేది వైసీపీ కార్యకర్తలే అని హితవు పలికారు. వైసీపీ నాయకులు ఎంత రెచ్చగొట్టినా కూటమి నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోబోమని, సంయమనంతో ఉంటామని, రాష్ట్రాభివృద్ధే తమ లక్ష్యమని వెల్లడించారు. ప్రజలు కూడా వారి మాటలను పట్టించుకునే పరిస్థితుల్లో లేరని మంత్రి సవిత స్పష్టం చేశారు.

# కర్ణాటకలో మామిడి ధరలపై జగన్ అబద్ధాలు

**- మంత్రి మండిపల్లి మండిపాటు**



గంగాధరనెల్లూరు (చైతన్యరథం): తోతాపురి మామిడిపై జగన్ రెడ్డి అబద్ధాలు చెబుతూ రైతులను మోసగిస్తున్నారని చిత్తూరు జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఒకరోజు జిల్లా పర్యటనలో భాగంగా గంగాధర్ నెల్లూరు మండలంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం నెల్లేపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మండిపల్లి మాట్లాడుతూ కర్ణాటకలో అధిక ధరకు తోతాపురి మామిడి కొనుగోలు చేస్తున్నారంటూ జగన్‌రెడ్డి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సాధారణంగా తోతాపురి మామిడి దిగుబడి ఏడాదికి సగటున 2.5 లక్షలు టన్నులు ఉంటుంది. ఈ ఏడాది 7లక్షల టన్నులకు చేరింది. పెద్ద ఎత్తున సరుకు మార్కెట్ రావడంతో ధర పడిపోతుందనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టింది. మామిడి రైతులు అడగకముందే కిలోకు రూ.4 అదనపు ధర అందించి రైతు వద్దనున్న ఆఖరి కాయ వరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలిచ్చినా అలజడి సృష్టించాలనే ఉద్దేశ్యంతో జగన్ కుట్రలకు తెరలేపాడు. కర్ణాటకలో ఎక్కువ ధర చెల్లిస్తు న్నారంటున్న జగన్‌కు ఈ సందర్భంగా మంత్రి పలు ప్రశ్నలు సంధించారు.

1. తోతాపురి మామిడికి ఆంధ్రప్రదేశ్ కంటే ఎక్కువ ధర కర్ణాటకలో లభిస్తుంటే తమ రాష్ట్రంలో పండిన పంటను ఏపీలో అమ్ముకోవడానికి అనుమతించాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య గత జూన్ 11న సీఎం చంద్రబాబుకి లేఖ రాయాల్సిన అవసరం ఏమిటి?
2. కర్ణాటకలో కేజీ రూ.4 మించి కొనుగోలు చేయడం లేదని ఆ రాష్ట్రానికి చెందిన ఎమ్మెల్యే మంజునాథ్ చెప్పిన విషయం వాస్తవం కాదా? అక్కడ రూ.16కు కొంటున్నారని తప్పుడు ప్రచారం చేసి రైతులకు ఆందోళన కల్పించిన రైతు ద్రోహులు వైసీపీ నేతలు కాదా?
3. ప్రభుత్వం ఇచ్చే అదనపు ధర ద్వారా కర్ణాటకలో ఒక్కో రైతు గరిష్ఠంగా రూ.40 వేలు మాత్రమే సాయం పొందుతుండగా, ఆంధ్రప్రదేశ్ లో రూ.2 లక్షల వరకు రైతులకు అందుతున్న విషయం నిజంకాదా?
4. ఐదు హెక్టార్ల వరకు మాత్రమే మామిడి కొనుగోలు చేస్తామని కర్ణాటకలో పరిమితి పెడితే ఇక్కడ ఎటువంటి పరిమితి లేకుండా కొనుగోలు చేయటం వాస్తవం కాదా? నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్న జగన్‌రెడ్డి.. తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని మంత్రి మండిపల్లి డిమాండ్ చేశారు.

## నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకి..

# పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

- **విశాఖ, తిరుపతి, విజయవాడ కేంద్రాల్లో అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ ద్వారా ఇప్పిస్తాం**
- **హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం సంరక్షణకు చర్యలు**
- **ఎస్సీ వసతిగృహాలు, గురుకులాల్లో విప్లవాత్మక మార్పులు**
- **మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**
- **పార్వతీపురం కలెక్టరేట్‌లో ఎస్సీ హాస్టళ్ల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో సమీక్ష**



పార్వతీపురం (చైతన్యరథం): అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ ద్వారా నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకి త్వరలో విశాఖ, తిరుపతి, విజయవాడ కేంద్రాల్లో బ్యాంక్ పీఓ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు పరీక్షలకు శిక్షణ ఇస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. శనివారం నాడు మన్యం జిల్లా పార్వతీపురం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎస్సీ హాస్టల్ వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాళ్లతో మంత్రి స్వామి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తూ వారి ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యం, భద్రత పట్ల ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దు. గురుకులాలు, వసతిగృహాల్లోని ఖాళీలన్నీ భర్తీ చేయాలి. గ్రామాల్లో తిరిగి విద్యార్థులతో ప్రవేశాలు చేయించాలి. అడ్మిషన్లలో తల్లిదండ్రులు కోల్పోయిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలి. ఎస్సీ వసతిగృహాలు, గురుకులాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. ఎస్సీ వసతిగృహాల మరమ్మతులకు రూ.143 కోట్లు ఇచ్చాం. నాణ్యమైన బియ్యంతో విద్యార్థులకు భోజనం పెడుతున్నాం. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు జిల్లాకొక హెల్త్ ఆఫీసర్‌ని నియమించాం. అనారోగ్యంతో మరణించిన విద్యార్థుల కుటుంబానికి సాంత్వన పథకంతో రూ.3 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నాం. రాష్ట్రంలో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 10కి పెంచాం. ఎస్సీ హాస్టళ్లలో ట్యూటర్లని నియమిస్తాం. అన్ని ఎస్సీ హాస్టళ్లు, గురుకులాల్లో త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. అన్ని గురుకులాలు, వసతి గృహాల్లో అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తాం. విద్యార్థులకు కాస్మోటిక్ కిట్స్ ఇస్తాం. ప్రిన్సిపాళ్లు, కేర్ టేకర్స్ విద్యార్థులను సొంత బిడ్డల్లా చూసుకోవాలి. పది, ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మంత్రి డా. స్వామి స్పష్టం చేశారు.

అంతకు ముందు మంత్రి డా.స్వామి మన్యం జిల్లా సీతానగరం మండలం జోగింపేట గురుకులంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కిచెన్, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి పాఠశాలలో సౌకర్యాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

# ఐదు నగరాలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు

అమరావతి (చైతన్యరథం): స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ పనితీరు కనబరిచింది. రాష్ట్రంలో ఐదు నగరాలకు కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించింది. విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరాలకు ఈ అవార్డులు దక్కాయి. జాతీయస్థాయిలో విశాఖ, రాష్ట్రస్థాయిలో రాజమహేంద్రవరం నగరాలకు స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డులు దక్కాయి. విజయవాడ, గుంటూరు తిరుపతి నగరాలు స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగానికి ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కావటంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరాం హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల వల్లే ఈ అవార్డులు దక్కాయన్నారు.

## ఇళ్ల పట్టాల పంపిణీకి అర్హుల జాబితా సిద్ధం చేయండి

●రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

●పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీపై రెవెన్యూ అధికారులతో సమీక్ష



నిమ్మాడ (చైతన్యరథం): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీకి స్థలాన్ని సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ అంశాలపై నందిగాం మండలంకు సంబంధించి, పలాస, టెక్కలి మండలాల రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ప్రస్తుతం గృహ నిర్మాణ లే అవుట్లలో ఎంతమంది లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకొన్నది, నిర్మాణం జరపవలసిన లబ్ధిదారుల వివరాలు అధికారులను ప్రశ్నించగా నందిగాం మండలంలోని లే అవుట్‌లో 1453 గృహాలు అర్హులకు మంజూరు చేయగా 236 మంది లబ్ధిదారులు ఇల్లు నిర్మాణం జరపగా, 1021 ఇళ్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చినమాట ప్రకారం సొంతింటి కల సాకరానికి అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇల్లు మంజూరు చేయాలని దృఢనిశ్చయంతో ఉన్నట్లు స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను సమగ్ర ప్రణాళికతో, జాబితాను సిద్ధం చేయాలని టెక్కలి, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారులు ఎం.కృష్ణ మూర్తి, వెంకటేష్‌లను ఆదేశించారు. త్వరలో పంపిణీకి చేసేందుకు వీలుగా అర్హుల జాబితాను తయారు చేయాలని చెప్పారు. ఇళ్ల స్థలాల లే అవుట్‌లను స్వయంగా వెళ్లి పరిశీలించాలని సూచించారు. నిర్దిష్ట ప్రణాళికా బద్ధంగా ఇళ్ల పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు కృష్ణమూర్తి, వేంకటేష్, సంబంధిత తాసిల్దార్‌లు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం పట్ల ప్రజకు విశ్వాసం కల్పించాం : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లాలోని సాలూరు మండలంలోని బాగువలస గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాకి చెందిన విద్యార్థులకు 40 సైకిళ్లను, సుమారు రూ.3 లక్షల వ్యయంతో పంపిణీ చేశారు. సాలూరు నియోజకవర్గంలో మరో 20 సైకిళ్లు అందజేశారు. వీకే యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగానే పేద విద్యార్థులైన వారు నూటికి 80 శాతం మార్కులు సాధిస్తే నెలకు రూ.1000 చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడం అభినందనీయమన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రముఖ సంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఉచిత విద్యా సహాయం అందింస్తున్న ఫౌండేషన్ నిర్వహకులకు గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యేకంగా అభినందించారు. "వీకే యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ వంటి సంస్థలు పేద విద్యార్థుల, అభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమైనది. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో మార్పును తీసుకొస్తాయన్నారు.

**బాగువలసలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం**

పార్వతీపురం మన్యం జిల్లాలోని బాగువలస గ్రామంలో "ఇంటింటికి తెలుగుదేశం - సుపరిపాలనకు తొలిఅడుగు 4.1" కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మంతనాలు జరిపిన మంత్రి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చలు జరుపుతామన్న విశ్వాసం ప్రజల్లో నింపారని అన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారి అభిప్రాయాలు వినడమే కాకుండా - ప్రభుత్వం అందిస్తున్న పథకాల ఫలితాలు ఎలా చేరుతున్నాయో స్వయంగా తెలుసుకున్నారు. మహిళల శక్తీకరణకు "తల్లికి వందనం", విద్యార్థులకు "మధ్యాహ్న భోజన పథకం", వృద్ధులకు "పెన్షన్లు", ప్రతి ఇంటికి వెలుగు నిచ్చే "దీపం పథకం" వంటి పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయనీ, ఇవన్నీ ప్రజల అభినందనలకు కారణమయ్యాయని పేర్కొన్నారు. గడిచిన ఏడాది కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, వాటి పట్ల ప్రజల ఆదరణ ఎంతో ఉత్సాహాన్ని కలిగించిందని మంత్రి తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి సమతుల్యత నినాదంతో కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసానికి నిదర్శనమవుతుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

## ప్రతిష్టాత్మకంగా రోజ్‌గార్ మేళా : కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు



శ్రీకాకుళం (చైతన్యరథం): రోజ్‌గార్ మేళాను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ఉద్ఘాటించారు. ఒక రికార్డ్‌లా రోజ్‌గార్ మేళా కార్యక్రమం ముందుకు సాగుతోందని చెప్పుకొచ్చారు. ప్రధాని మోదీ దేశం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో భారత్ నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని ఉద్ఘాటించారు. శనివారం విశాఖపట్నంలోని సాగర్ మాలా కన్వెన్షన్ సెంటర్‌లో రోజ్‌గార్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోజ్‌గార్ మేళాలో పాల్గొన్న 52 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం లలిత్ బొహ్రా, రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మీడియాతో మాట్లాడారు. విశాఖలో రోజ్‌గార్ మేళాలో 52 మందికి ఉద్యోగ నియామక పాత్రలు అందజేశామని తెలిపారు. మూలపేట నుంచి భోగాపురం వరకు తీర ప్రాంతం గుండా రోడ్డు మంజూరు కావడం శుభపరిణామమని అన్నారు. ఆ రోడ్డు ప్రస్తుతం డీపీఆర్ స్టేజ్‌లో ఉందని తెలిపారు. ఈ రోడ్డు ఉత్తరాంధ్ర జిల్లాలకు ఎంతగానో ఉపయోగపడుతోందని చెప్పారు. త్వరలో ఆ రోడ్డు పనులు ప్రారంభించడానికి తమవంతుగా కృషి చేస్తామని అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి సంబంధించి ఏఏఐబీ ప్రాథమిక నివేదిక వచ్చిందని తెలిపారు. ప్రాథమిక నివేదిక ద్వారా ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించలేమని చెప్పారు.

## సుపరిపాలనతో రాష్ట్ర ప్రజలు సురక్షితం : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమిలి (చైతన్యరథం) : రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారం చేపట్టినప్పటి నుంచి సుపరిపానలతో ప్రజలు సురక్షితంగా ఉన్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన సుపరిపాలనకు తొలిఅడుగు - ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన ఇంటింటికి వెళ్లి యేడాది పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్ట బోయే పథకాలను ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకి పలు వినతులు వచ్చాయి. భీమిలి నియోజకవర్గం 8వ వార్డు సాగర్‌నగర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక శ్రీ షిరిడి సాయి సాగరేశ్వర స్వామి వారి కళ్యాణ మండపంలో ఆర్పీలకు ట్యాబులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పంచకర్ల సందీప్, జనసేన నాయకులు శేఖరి శ్రీనుబాబు, స్థానిక వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ దొరబాబు, యూనిట్ ఇన్‌ఛార్జ్ అక్కర్బోయిన రాంబాబు, శతపతి రవికుమార్, 98వ వార్డు కార్పొరేటర్ పి.వి నరసింహం, సీనియర్ నాయకులు గాడు అప్పలనాయుడు, పిల్లా వెంకట్రావు మరియు జీవీఎంసీ అధికారులు నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల్లో మంచి ఆదరణ! : ఎమ్మెల్యే వెలగపూడి



విశాఖపట్నం (చైతన్యరథం): తమ కూటమి సంక్షేమ, అభివృద్ధి పాలన పట్ల విశాఖ తూర్పు నియోజకవర్గ ప్రజల్లో మంచి ఆదరణ కనిపిస్తోందని విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆనందం వ్యక్తం చేసారు. సుపరిపాలనలో తొలిఅడుగు అని టీడీపీ ఇచ్చిన పిలుపు మేరకు నగరంలోని 28వ వార్డులో ఊటగెడ్డలో పర్యటించి ప్రజల కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమం ద్వారా నియోజక వర్గంలోని ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు తాము ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే చాలా వరకు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, మిగిలినవి కూడా అతి త్వరలో పూర్తిగా అమలు చేస్తామన్నారు. సోషల్ ఇంజనీరింగ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారని, సమాజంలోని అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం సమర్థవంతంగా అందించడమే అతని లక్ష్య మన్నారు. ఈ కార్యక్రమంలో 28వ వార్డు టీడీపీ అధ్యక్షులు నక్క కనకరాజు, ఊరుకుటి పైడిరాజు, పోలిపల్లి సురేష్, పళ్ళ శ్రీను, కనకమహాలక్ష్మి, మంగమ్మ, దొక్కరి శ్రీను తెలుగుదేశం కార్యకర్తలు మరియు నాయకులు పాల్గొన్నారు.

## ప్రగతి పథంలో పరుగులుపెడుతున్న రాష్ట్రం : పీ.జీ.వి.ఆర్ గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): జగన్ పాలనలో గాడితప్పిన అభివృద్ధి, సంక్షేమాన్ని కేవలం ఏడాది పాలనలోనే ప్రగతి పథంలో నడిపించామని, ఎన్నడు లేని విధంగా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వస్తున్నాయని కూటమి పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్ నాయుడు వ్యాఖ్యానించారు. శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భగంగా నియోజకవర్గవంలోని స్థానిక 8వ వార్డు శ్రీహరిపురం, పాత రామాలయం వద్ద నుండి గుల్లలపాలెం వరకు వార్డు అధ్యక్షులు కోరాడ శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ పోతాబత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు, ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం గణబాబు మీడియాతో మాట్లాడుతూ... అచ్చంనాయుడు లోవలో టిడ్కో ఇల్లులు పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు ఇవ్వడం జరుగుతుందని, ఇప్పటికే 33 కెవి సబ్ స్టేషన్ కూడా ప్రారంభించామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం కింద తల్లులు ఖాతాలో జమ చేసిన ఏకైక ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని, తనను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన పశ్చిమ నియోజకవర్గం ప్రజలకు సేవ చేయడమే తన సంకల్పమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శిరం ఉమా మహేశ్వరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొప్పుల వెలమ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్ రామ్మోహన్ నాయుడు, యూనిట్ ఇన్‌ఛార్జ్‌లు, బూత్ ఇన్‌ఛార్జ్‌లు, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ అరాచకంపై 'మన్నవ' అక్షర సమరం

●మన్నవ సుబ్బారావు అక్షర పోరాటం అభినందనీయం

●పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రఘురామకృష్ణరాజు, కే రాఘవేంద్రరావు తదితరుల ప్రశంసలు



వాషింగ్‌టన్/అమరావతి (చైతన్యరథం): గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలో జరిగిన దుర్మార్గాలని 'అరాచకంపై అక్షర సమరం'లో టీడీపీ సీనియర్ నేత, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు ఎండగట్టారని వక్తలు కొనియాడారు. ఇలాంటి ఎందరో నాయకుల పోరాట పటిమతోనే రాష్ట్రంలో నియంతృత్వానికి చిరునామా లేకుండా ప్రజలు చెరిపేశారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు అన్నారు. వాషింగ్ టన్ డీసీలో 'అరాచకంపై అక్షర సమరం' పేరుతో మన్నవ సుబ్బారావు వ్రాసిన వ్యాస సంపుటిని శుక్రవారం ప్రముఖ దర్శకుడు కే.రాఘవేంద్రరావుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ..." గతప్రభుత్వ తప్పిదాలను సునిశితమైన విమర్శలతో, పరిశీలనాత్మకంగా శోధించి వివిధ పత్రికలకు 200కు పైగా వ్యాసాలను రాయడం అభినందనీయమన్నారు. కుల, మత, ప్రాంతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొడుతూ వికృత రాజకీయాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజల గొంతుకై మన్నవ సుబ్బారావు తన కలం ద్వారా గళం విప్పారు. నేర రాజకీయాల కబందహస్తాల నుండి ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో తనవంతు పాత్ర నిర్వహించారు" అని పేర్కొన్నారు.

**ప్రముఖ సినీ దర్శకులు రాఘవేంద్రరావు మాట్లాడుతూ...**

ప్రజల అంతరంగాన్ని శోధించి మన్నవ సుబ్బారావు విశ్లేషించారు. గత ఐదు సంవత్సరాల్లో పాలన ఎన్నడూ చూడలేదు. హింస, వేధింపులు, అణచివేతలు చూశాం. మానవ సమాజాన్ని సమూలంగా ధ్వంసం చేశారు. అందుకే ప్రజలు తిరగబడ్డారు. ఇవన్నీ వ్యక్తిగత విషాదాలు కావు, సామూహిక విషాదాలే అని అన్నారు.

**మైలవరం శాసనసభ్యులు వసంతకృష్ణప్రసాద్ మాట్లాడుతూ...**

ప్రశ్నిస్తేనే ప్రజాస్వామ్యం ఫరిడమిల్లుతుందన్నారు. ప్రజల పక్షాన నిలిచి జనం గొంతుకయ్యారు. గత అవినీతి, అసమర్థ పాలనకు చరమగీతం పాడేందుకు మన్నవ సుబ్బారావు రాసిన వ్యాసాలు దోహదపడ్డాయి.

**మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ..**

పౌర హక్కులనే కాదు.. అసలు జీవించే హక్కునే జగన్మోహన్ రెడ్డి కాలరాశారు. ఆధునిక ప్రజాస్వామ్యంలో ఇలాంటి పాలన దేశ చరిత్రలో ఎక్కడా చూడలేదు. తన పాలనలోని లోపాలను ఎవరూ ప్రశ్నించకూడదు, చైతన్యరహితంగా ఉండాలని ఆయన భావించారు. ప్రజలను చైతన్యపరచేందుకు బాధ్యత కలిగిన పౌరుడిగా నా కర్తవ్యాన్ని నిర్వహించానన్నారు.

**తానా పూర్వ అధ్యక్షులు సతీష్ వేమన మాట్లాడుతూ...**

దేశంలో ఎక్కడా లేని క్రూరమైన అమానుష చట్టాల అమలుపై అక్షర సమరం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో, భాను మాగలూరి, సుధీర్ కుమ్మి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతలు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలి

● హెచ్చరించిన మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు



విజయవాడ (చైతన్యరథం): 151 సీట్ల మదంతో జగన్ చేసిన దుర్మార్గాలకు 11 సీట్లతో ప్రజలు లేవకుండా చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... చీకట్లో కన్ను కొట్టే తప్పుడు పనులు చేయబట్టే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి బలి చేసేందుకే గవర్నమెంట్ వచ్చాక సైలెంట్‌గా వేసెయ్యాలంటూ మాజీ మంత్రి పేర్నినాని పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రధాన మంత్రి కార్యాలయానికి బాంబే స్టాక్‌కు దేశ విదేశాల్లో ఉన్న వైసీపీ కార్యకర్తలతో తప్పుడు మెయిల్స్ పెట్టించి పెట్టుబడులు రాకూడదని కుట్రలు చేశారని విమర్శించారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని ఆయన వెల్లడించారు. సొంత కార్యకర్త సింగయ్యను కారుతో తొక్కించిన జగన్‌రెడ్డి తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి సింగయ్య భార్యను బెదిరించి తప్పుడు ప్రకటన ఇప్పించారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టాలన్నదే జగన్ వ్యూహకర్తల పన్నాగమని ఆరోపించారు. సోదరి వరస అయ్యే మహిళా ఎమ్మెల్యే పట్ల ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఖండించకుండా జగన్ సమర్థించారన్నారు. జగన్‌రెడ్డి అంతరంగంలో ఉన్న మాటలే ప్రసన్న కుమార్‌రెడ్డి, పేర్ని నాని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. చంద్రయ్య గొంతు కోసినందుకే కదా ఈ దుస్థితి పట్టిందని కామెంట్స్ చేశారు. 'కర్మ ఫలం అనుభవిస్తున్నామంటూ విజయసాయిరెడ్డి భగవద్గీత శ్లోకాలు బోధిస్తున్నారు. సిట్ విచారణలో నీ దగ్గర పనిచేసిన అధికారులే నీ గుట్టు విప్పుతున్నారు' అని అన్నారు. శాసనసభపై, అంబేద్కర్ రాజ్యాంగంపై గౌరవం లేకుండా ఇష్టానుసారం ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరు జగన్‌రెడ్డి అని హెచ్చరించారు.

# సుపరిపాలనతో రాష్ట్ర ప్రజలు సురక్షితం



వేమూరు నియోజకవర్గంలో తొలి అడుగు కార్యక్రమంలో నక్కా ఆనందబాబు



చిలకలూరిపేట నియోజకవర్గంలో ప్రత్తిపాటి పుల్లారావు ప్రచారం




మంగళగిరిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ



గుంటూరు 53వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పార్టీ శ్రేణులు



చీరాలలో ఇంటింటికి ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు



నందిగామ జిల్లా చందర్లపాడు గ్రామంలో బీసీ కాలనీలో తొలి అడుగు కార్యక్రమం



నెల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న అబ్దుల్ అజీజ్ తదితరులు



ఎస్ కోట నియోజకవర్గంలో ఇంటింటికి ప్రచారం చేపడుతున్న కోళ్ల లలిత



ఆదోనిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మీనాక్షినాయుడు

# సూపర్ సిక్స్‌కు కట్టుబడే ఉన్నాం... అంతర్వేదిపాలెంలో తొలిఅడుగు



సఖినేటిపల్లి (చైతన్యరథం): ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్‌ను అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, మీడియా కోఆర్డినేటర్ బోళ్ల సతీష్‌బాబు పేర్కొన్నారు. కూటమి పాలనలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఏడాది పాలనలో వివిధ పథకాలను విజయవంతంగా అమలు చేశారన్నారు. రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శ్రీనివాస్, సతీష్‌బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూటమి విజయాలను ఇంటింట ప్రచారం చేశారు. వృద్ధులకు పింఛను, తల్లికి వందనం, దీపం-2 పథకాలను అందించిన చంద్రన్న.. త్వరలోనే అన్నదాత సుఖీభవ అమలు చేస్తారన్నారు. ఆగస్ట్ 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి రానుందన్నారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు తాడి సత్యనారాయణ, అంతర్వేదిపాలెం పుల్లయ్య, బత్తిన గంగాధర్, సలాది దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

●గుడివాడ రూరల్ మండలంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము 'సుపరిపాలనలో తొలి అడుగు' ఇంటింటి ప్రచారం



గుడివాడ (చైతన్యరథం): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ మండలంలోని చౌటపల్లి, మల్లయ్య పాలెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు ప్రచారాన్ని శనివారం సాయంత్రం ఎమ్మెల్యే రాము నిర్వహించారు. గ్రామాల్లో ఎమ్మెల్యే రాముకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లిన ఎమ్మెల్యే రాము ప్రజలను ఆత్మీయంగా పలకరిస్తూ.... ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ... ప్రజలకు కరపత్రాలు అందచేశారు. కులమత వర్గాలకతీతంగా పేద ప్రజల శ్రేయస్సే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. గత ప్రభుత్వాల కంటే పేద కుటుంబాలకు అధిక సంక్షేమం అందిస్తున్నామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్లో ప్రజలకు సమస్యలు తెరెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే రాము వెల్లడించారు. ఇరు గ్రామాల్లో ఎమ్మెల్యే రాము పర్యటిస్తున్నంత సేపు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు ఆయన వెంట నడుస్తూ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు.

# సంక్షేమాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

**● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న బొండా ఉమామహేశ్వరరావు**



విజయవాడ (చైతన్యరథం): సంక్షేమాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు వ్యాఖ్యానించారు. శనివారం సాయంత్రం 1వ డివిజన్ గుణదల ఉలవచారు కంపెనీ దగ్గర గల ఆదర్శనగర్ కాలనీలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన “సుపరిపాలనలో – తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని “సుపరిపాలనలో – తొలి అడుగు” కరపత్రాలను నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... సుపరిపాలన కార్యక్రమాన్ని సెంట్రల్ నియోజకవర్గం అంతటా ముమ్మరంగా 21 డివిజన్లలో కొనసాగిస్తున్నామని, నియోజకవర్గంలో ఉన్నటువంటి 2.80 లక్షల మంది ఓటర్లను కలిసి కూటమి పరిపాలన పట్ల ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్నామని, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నామని అన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్ళులా భావిస్తూ ముందుకు వెళ్తు నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.240 కోట్ల విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే వృద్ధాప్య పింఛన్ను రూ.3,000 నుంచి రూ.4,000కి, వికలాంగుల పింఛన్ను రూ.3,000 నుంచి రూ.6,000కి పెంచి 1వ తారీకు ఉదయం ఆరు గంటలకల్లా అందిస్తున్నామని, అలాగే, మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, “తల్లికి వందనం” పథకం ద్వారా తల్లుల జీవితాల్లో ఆనందం నింపామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రానుందన్నారు. త్వరలో “శ్రీనిధి పథకం” అమలుకు సిద్ధంగా ఉందని, దీని ద్వారా ప్రతి మహిళా లబ్ధిదారికి 18,000 అందజేస్తామన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : యార్లగడ్డ

గన్నవరం (చైతన్యరథం): రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తమ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరుగుతూ గత ఏడాదికాలంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను సావధానంగా విన్న ఆయన వాటిని సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం బకాయిలను తాము అధికారం చేపట్టిన వెంటనే చెల్లించినట్లు చెప్పారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రైతుల వద్ద నుండి 68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి, ధాన్యం సొమ్మును నెలలోపు రైతుల అకౌంట్లో జమ చేసినట్లు తెలిపారు. ఏడాది ప్రకృతి అనుకూలించడంతో కృష్ణా డెల్టాకు సకాలంలో సాగునీటిని విడుదల చేశామన్నారు. గత ఐదేళ్లుగా సాగునీటి కాలువల మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువలు పూడుకుపోయి రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతుల ఇబ్బందులను గమనించిన తమ ప్రభుత్వం వర్షాలు ప్రారంభం కావడానికి



ముందే పంట కాలువల మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు. గన్నవరం నియోజకవర్గంలో సాగునీటి సంఘాల ద్వారా పంటకాలువల పూడికలు తీయించి సాగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని అర్హత గల రైతులందరికీ ఈ పథకం వర్తింప చేస్తామన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు, స్ప్రేయర్లు తదితర యంత్ర పరికరాలు రాయితీపై ఇస్తున్నట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలో గ్రామీణ నీటిపారుదల శాఖ ద్వారా ఆధునీకరణ అభివృద్ధి పనులకు ఈ ఏడాది కాలంలో రూ.85 లక్షల ఖర్చు చేసినట్లు వివరించారు. పాడి రైతులకు సహాయం చేయూత నిచ్చేందుకు రూ. 3.26కోట్ల ఖర్చుతో 186 మినీ గోకులం షెడ్లు నిర్మించినట్లు యార్లగడ్డ వివరించారు.

# రప్పా.. రప్పా.. అంటే రఫ్ఫాడించేస్తాం



**●నువ్వు ప్రజాస్వామ్యవాదివా! నియంతవా!**

**●నానీ..! నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలు నాలుక చీరేస్తారు**

**●మాజీ మంత్రి.. వైసీపీ నాయకుడు పేర్ని నానికి 'వీరంకి' హెచ్చరిక**

విజయవాడ (చైతన్యరథం): వైసీపీ నేతలు చీకటి సామాజాలకు అధిపతులని, చీకటి వ్యవహారాల్లో ఆరితేరిపోయారని, రప్పా.. రప్పా అంటూ నోటికి వచ్చినట్టు మాట్లాడితే రఫ్ఫాడించేస్తామని, నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజలు నాలుక చీరేస్తారని మాజీ మంత్రి, వైకాపా నాయకుడు పేర్ని వెంకట్రామయ్య (నాని)ని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తి తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పేర్ని నాని వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం గురుమూర్తి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ.. కుట్రలు.. కుతంత్రాలు వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శమన్నారు. చీకటి వ్యవహారాలు.. హింస.. విధ్వంసం వైకాపా నైజమని, మాది రాజారెడ్డి రాజ్యాంగం కాదు అంబేద్కర్ రాజ్యాంగమని నాని గుర్తెరగాలన్నారు. ప్రజల భద్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే ప్రజాస్వామ్యాన్ని అంతమొందించేందుకు వైసీపీ కుట్రలకు పాల్పడటం వారి కుసంస్కారానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచిని, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఒక్కొక్కరిగా వైసీపీని వీడుతున్నారని, అధికారానికి దూరమయ్యామనే క్రోధంలో పార్టీ ఉనికిని కాపాడుకునే పనిలో వైసీపీ నేతలు ఉన్నారని, హింసం, విధ్వంసం కలిస్తే వైసీపీ అన్న విషయం నేడు పేర్ని నాని వ్యాఖ్యల ద్వారా మరోసారి స్పష్టమైందన్నారు. ఇటీవల సత్తెనపల్లి పర్యటనలో వైసీపీ నేతలు రప్పా రప్పా నరికేస్తామని, రాజారెడ్డి రాజ్యాంగం పల్నాడు నుంచే అమలు చేస్తామని ప్లకార్డులు ప్రదర్శిస్తే జగన్మోహన్‌రెడ్డి నవ్వుతూ సమర్థించడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ అలసత్వాన్ని ఆసరాగా తీసుకొని మాజీ మంత్రి పేర్ని నాని చీకట్లో నరికేయండి.. సాక్ష్యాధారాలు లేకుండా హతమార్చండి అంటూ పిలుపివ్వడం వైసీపీ నేతల నేర సంస్కృతికి నిలువెత్తు నిదర్శనమంటూ నిప్పులు చెరిగారు.

# వైసీపీ కుట్రలు, దుర్మార్గాలకు ప్రజలు బుద్ధి చెప్పారు

**●పేర్ని నాని అభ్యంతరకర వ్యాఖ్యలపై యంత్రాంగం సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి : దేవినేని ఉమా**



విజయవాడ (చైతన్యరథం): ఎన్నికల హామీలను అమలుచేసి నిలబెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుకే దక్కుతుందని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో శ్రీనివాస మ్యాన్షన్, అభినందన అపార్ట్‌మెంట్‌లలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా స్థానిక నేతలతో కలసి ఆయన పర్యటించి కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ క్రమంలో వైసీపీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)లపై దేవినేని ఉమా మహేశ్వరరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. 151 సీట్ల మదంతో జగన్‌రెడ్డి చేసిన దుర్మార్గాలకు ప్రజలు 11 సీట్లతో వైసీపీని లేవకుండా చేశారని, “చీకట్లో కన్ను కొట్టి” తప్పుడు పనుల వల్లే ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు. వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టి బలి చేసేందుకే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సైలెంట్‌గా వేసెయ్యాలంటూ పేర్నినాని పిచ్చి ప్రేలాపనలు మాట్లాడుతున్నాడని ఆరోపించారు. దేశ-విదేశాల్లో ఉన్న వైసీపీ కార్యకర్తలతో ప్రధానమంత్రి కార్యాలయానికి, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు తప్పుడు ఈమెయిల్స్ పెట్టించి, రాష్ట్రంలో పెట్టుబడులు రాకుండా కుట్రలు చేసినట్లు జగన్‌రెడ్డి వ్యవహరించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నారని ఉమా తెలిపారు. సొంత కార్యకర్త సింగయ్యను కారుతో తొక్కించిన జగన్‌రెడ్డి, తన తప్పును కప్పిపుచ్చుకోవడానికి సింగయ్య భార్యను బెదిరించి తప్పుడు ప్రకటన ఇప్పించారని దేవినేని ఉమా ఆరోపించారు. రాష్ట్రంలో విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టాలన్నదే జగన్ వ్యూహకర్తల పన్నాగమని, సోదరి వరస అయ్యే మహిళా ఎమ్మెల్యేపై ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను జగన్ ఖండించకుండా సమర్థించారని ఆయన విమర్శించారు. జగన్‌రెడ్డి అంతరంగంలో ఉన్న మాటలే ప్రసన్న కుమార్‌రెడ్డి, పేర్ని నానిలు మాట్లాడుతున్నారని ఉమా ధ్వజమెత్తారు. చంద్రయ్య గొంతు కోసినందుకే వైసీపీకి ఈ దుస్థితి పట్టిందని, కర్మ ఫలం అనుభవిస్తున్నామంటూ విజయసాయిరెడ్డి భగవద్గీత శ్లోకాలు బోధిస్తున్నారని ఉమా విమర్శలు గుప్పించారు. సిట్ విచారణలో జగన్ దగ్గర పనిచేసిన అధికారులే ఆయన గుట్టు విప్పుతున్నారని, శాసనసభపై, అంబేద్కర్ రాజ్యాంగంపై గౌరవం లేకుండా ఇష్టానుసారం ప్రవర్తిస్తే ప్రజలు హర్షించరని జగన్‌రెడ్డికి హెచ్చరికలు జారీ చేశారు. పేర్ని నాని అభ్యంతరకర వ్యాఖ్యలపై యంత్రాంగం సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని దేవినేని ఉమా కోరారు.

# కూటమితోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యం

**● గుంటూరులో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పరిరక్షణ ఎన్డీయే కూటమితోనే సాధ్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శనివారం 20,21వ డివిజన్‌లలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించి, ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేసిన హామీలను వివరిస్తూ, రూపొందించిన కరపత్రాలని ప్రజలకు వివరించారు. వారి నుండి వినతిపత్రాలు స్వీకరించారు. తొలుత స్థానిక దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు నల్లచెరువు, యతిరాజా నగర్లలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... నల్లచెరువులో ఇంటింటికి తిరుగుతుంటే ప్రజలు తమ పాలన పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారని, ఒకే ఇంట్లో 3 పిల్లలకు తల్లికి వందనం వచ్చిందని చెప్పడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కొన్ని ప్రాంతాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరగా... నల్లచెరువు ప్రాంతంలో గంజాయి బ్యాచ్‌ను కట్టడి చేయమని ప్రజలు కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో గంజాయి కట్టడికి కృషి చేయడం జరిగిందని, అయినా కూడా కొన్ని చోట్ల గంజాయి బ్యాచ్‌కి బుద్ధి రావడం లేదన్నారు. గంజాయి కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని, రాత్రి వేళల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచుతామన్నారు. 21వ డివిజన్‌లో గెలిచిన నాటి నుండి ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలను భారీఎత్తున చేపట్టడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో 21వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తయారు చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ ఇమ్రాన్, చిన్న మస్తాన్ వలి, కనపర్తి శ్రీనివాస్, కసుకుర్తి హనుమంతరావు, మొహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

# హామీలన్నీ నెరవేరుస్తాం

## సుపరిపాలన తొలి అడుగులో మంత్రి నారాయణ

నెల్లూరు, (చైతన్యరథం): సుపరిపాలన తొలిఅడుగుకు ఎక్కడికి వెళ్లినా బ్రహ్మరథం పడుతున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు.ప్రతీ ఇంటికి పార్టీలకతీతంగా లబ్ది చేకూరిందన్నారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చాక ప్రశాంతంగా ఉన్నామని సంతోషంగా చెబుతన్నారన్నారు. చంద్రబాబు నాయుడి పరిపాలన చాలా బాగుందని కితాబునిచ్చారన్నారు. ఆర్ధిక ఇబ్బందులు ఉన్నా



మాటమీద నిలబడ్డ ప్రభుత్వమన్నారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడుకున్న అపార అనుభవంతో పరిస్థితులు చక్కబడుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని ఎక్కడికక్కడ నిలిపేసిందన్నారు. ఆగిపోయిన పనులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నామన్నారు. నెల్లూరు కటారి పాలెంలో పేదల కోసం చేపట్టిన కమ్యూనిటీ హాల్ పనులు ఆపేశారన్నారు. ఆరునెలల్లో కమ్యూనిటీ హాల్ పూర్తి చేసి అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. నెల్లూరులో 50 కోట్లతో డ్రైన్లు, కాలువల పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. హామీలన్నీ వందశాతం నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ మహేంద్రా రెడ్డి, క్లస్టర్ ఇంచార్జిలు కపిర శ్రీనివాస్, సత్యనాగేశ్వర రావు, కో క్లస్టర్ ఖాదర్ బాషా, టీడీపీ మహిళా నాయకురాలు కపిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

# పేదరికం లేని సమాజ నిర్మాణమే కూటమిలక్ష్యం

## కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, (చైతన్యరథం): పేదరికం లేని సమాజ నిర్మాణం కోసమే కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఉలవపాడు మండలం ఉలవపాడు పంచాయతీ అంబేద్కర్ నగర్‌లో జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పెన్షన్ పెంపుదల ఉచిత గ్యాస్ సిలిండర్ తల్లికి వందనం మరియు పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు.. ఇంకా ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే వారి జాబితాను సిద్ధం చేయాలని పార్టీ నాయకులకు ఆదేశించారు రాష్ట్రంలో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే గత ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా అనేక సంక్షేమ పథకాల ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అందిస్తున్నారన్నారు. సుపరిపాలన తొలి అడుగు అనే కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునే కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఎమ్మెల్యే తెలియజేశారు.. ప్రజలు కూటమి ప్రభుత్వం పనితీరుపై హర్షం వ్యక్తం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఉలవపాడు పంచాయతీని మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉలవపాడు మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చిరుతోటి గిరి, ఎంపీటీసీ యలమందమ్మ, అంచు పోగు వాసు, బొడ్డు ప్రసాద్ తొట్టెంపూడి మాల్యాద్రి చింతల సింగయ్య, దాసరి వెంకటరావు పాలేటి నారాయణస్వామి, సన్ని బోయిన ప్రభావతి జంగాల కోటేశ్వరమ్మ బెల్లంకొండ సుభరత్తమ్మ వాయల జాలమ్మ, కట్టా కృష్ణ, అమ్మనబ్రోలు రమేష్ అమ్మనబ్రోలు మాధవ ఓగోబోయిన యానాది, మాల్యాద్రి కోటు బాలయ్య, జంగాల శివప్రసాద్ ఎస్కే ఖాదర్బాషా ఎస్కే బాబు బడితల శివప్రసాద్ బత్తిన ప్రసాద్ బడితల సాంబయ్య, బెల్లం కృష్ణమోహన్ పోలుబోయిన శ్రీను, మద్దసాని మహేంద్ర మండలంలోని గ్రామ పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పీఏసీ డబ్బులు దండుకుంటున్నారు

### టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జి రాజా విమర్శలు

కొడవలూరు, (చైతన్యరథం): నెల్లూరులో వైసీపీ నాయకులు కొత్త రకం డ్రామా మొదలుపెట్టారని, పీఏసీ ఏర్పాటు చేసి డబ్బులు



దండుకుంటున్నారని కోవూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ టీడీపీ అధ్యక్షులు జి.రాజా పీఏసీ అంటే ప్రసన్న, అనిల్, చలపతి అని వివరించారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వారే అనుచిత వ్యాఖ్యలు చేసి తిరిగి సింపతీ డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. కొడవలూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో అనిల్ కుమార్ యాదవ్ ఒక బెట్టింగ్ రాజా అని దుయ్యబడ్డారు. వేమిరెడ్డి దంపతులను విమర్శించే స్థాయి అనిల్ కు లేదని, వారిని విమర్శిస్తే పుట్టగతులు ఉండవని వ్యాఖ్యానించారు. గతంలో వేమిరెడ్డి దంపతుల దగ్గర డబ్బులు తీసుకున్నది వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. వీరి చలపతి స్థాయి జిల్లాలో అందరికీ తెలుసు అని, బ్రోకరిజంలో, దోపిడీలో చలపతిని మించిన వారు లేరన్నారు. గతంలో పోలంరెడ్డి దినేష్ రెడ్డిని అనరాని మాటలు అన్న విషయాన్ని మర్చిపోవద్దన్నారు. చేసిన తప్పులతో త్వరలోనే జైలుకు వెలతారన్నారు.

# మామిడి రైతులపై జగన్ కుట్ర బట్టబయలు

## తంబళ్లపల్లి టీడీపీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్రరెడ్డి

ములకలచెరువు, (చైతన్యరథం): మామిడి రైతులపై జగన్మోహన్ రెడ్డి కుట్రలు కర్ణాటక సాక్షిగా మరోసారి బట్టబయలయ్యాయని తంబళ్లపల్లి టీడీపీ ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్రరెడ్డి దుయ్యబట్టారు. టీడీపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ



తోతాపురి మామిడి ఉత్పత్తి ఏడాదికి సగటున 2.5 లక్షలు టన్నులు ఉంటుందని ఈ ఏడాది 7లక్షల టన్నులకు చేరిందని వెల్లడించారు. పెద్ద ఎత్తున సరుకు మార్కెట్ రావడంతో ధర పడిపోతుందనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. మామిడి రైతులు అడగకముందే కిలోకు రూ.4 సబ్సిడీని అందించి రైతు వద్దనున్న ఆఖరి కాయ వరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం స్పష్టంగా ఆదేశాలిచ్చినా అలజడి సృష్టించాలనే ఉద్దేశ్యంతో జగన్ కుట్రలు చేశాడన్నారు. సమావేశంలో దాసరిపల్లి జయచంద్రరెడ్డి గారితో పాటు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



# ఆపద్బాంధవుడు సీఎం చందబాబు

## లబ్ధిదారులకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు, (చైతన్యరథం): పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరయిన ఆర్థిక సహాయ చెక్కులను లబ్దిదారులకు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు అందచేశారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ వివిధ ఆరోగ్య కారణాల రిత్యా ఆసుపత్రిలలో వైద్య సహాయం పొంది వైద్య ఖర్చులు భారమై ఆర్దిక సమస్యలతో సతమతమవుతున్న వారికి కొంత ఊరటగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లబ్దిదారులకు కొంత మేర ఆర్దిక సహాయం మంజురుచేయడం జరుగుతోందన్నారు. అందులో భాగముగా నియోజకవర్గంలో 45 మందికి 77 లక్షల 33 వేల రూపాయల ఆర్దిక సహాయం చెక్కుల రూపంలో లబ్దిదారులకు పంపిణీ చేశామని వెల్లడించారు.




# సమస్యల పరిష్కారానికి కృషి

## ప్రజావేదికలో ఎరిక్సన్‌బాబు

యర్రగొండపాలెం, (చైతన్యరథం): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ప్రజా సమస్యలను అర్జీల రూపంలో తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస రావు, అధికారులు టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## చేజర్లలో సుపరిపాలన-తొలిఅడుగు

చేజెర్ల, (చైతన్యరథం0: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంరాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు కిమ్స్ డైరెక్టర్ తాళ్ళూరి గిరినాయుడు సూచనలతో పడమటి కండ్రికలి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలం కూటమి ప్రభుత్వ పనితీరు వివరించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల టీడీపీ అధ్యక్షులు షేక్ సిరాజుద్దీన్, టీడీపీ సీనియర్ నాయకులు రావి లక్ష్మీ నర్సారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు రాజాల ఆదినారాయణ రెడ్డి,చీర్ల వెంకటేశ్వర్లు, గాలిపాలెం టీడీపీ నాయకులు ఓరుగంటి రమేష్ నాయుడు, పయ్యావుల వెంకటరత్నం, భారత్ మహాసేన నాయకులు జువ్విగుంట బాబు, పడమటి కండ్రిక టీడీపీ నాయకులు ముత్తం సుధాకర్, గాడిపర్తి సురేష్ బాబు టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## కనిగిరిలో ఇంటింటికీ టీడీపీ

కనిగిరి, (చైతన్యరథం): ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రెండో వార్డు 146వ బూతులో ఎన్డీఏ కూటమి సంవత్సర కాలంలో చేపట్టినటువంటి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసరెడ్డి క్లస్టర్ ఇంచార్జి బాల బాబు, యూనిట్ ఇన్చార్జి పాలూరి సత్యం, బూత్ ఇన్చార్జి సుబ్బారావు శేఖర్, కరిముల్లా, వాసు నరసింహ స్వామి, అంజమ్మ, నారాయణమ్మ, ఫణి దుర్గ, ఫాతిమా, రమణయ్య, పాల్గొన్నారు.



# మడకశిరలో ఇంటింటికీ టీడీపీ

మడకశిర, (చైతన్యరథం): మడకశిర నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో కొనసాగుతోంది. మడకశిర ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు ఎమ్మెస్ రాజు ఉత్సాహంగా



ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంచారు. ఆప్యాయంగా పలకరించారు. రాష్ట్ర ప్రభుత్వం గడిచిన సంవత్సర కాలంలో ప్రజలకు ఏమేమి చేసిందో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందరికీ సవ్యంగా అందుతున్నాయా, లేదా? అనే విషయాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. సంబంధిత అధికారులకు తక్షణమే ఫోన్ చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్చార్జులు, మాజీ జెడ్పిటిసిమాజీ ఎంపీపీ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# కొత్త చెరువులో తాగునీటి సమస్య పరిష్కారం

## ఇంటింటికీ టీడీపీలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

కొత్తచెరువు, (చైతన్యరథం): కొత్తచెరువు మండలం కేసాపురం పంచాయతీలో నిర్వహించిన ఇంటింటికి తొలి అడుగు సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం గ్రామంలో గత 20 రోజులుగా త్రాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, దృష్టికి



గ్రామస్తులు తీసుకురాగా. స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే అధికారులను వెంకటాపురానికి రప్పించి పది నిమిషాల్లోనే నేటి సమస్యను తీర్చడంతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డికి,గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పర్యటించి ఏడాదిలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను సంక్షేమ పథకాలను కరపత్రం ద్వారా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కొత్తచెరువు మండల కన్వీనర్లు ఒలిపి శ్రీనివాసులు, రామకృష్ణ, సత్యసాయి జిల్లా అధికార ప్రతినిధి సాలగ్ గారి శ్రీనివాసులు, సత్యసాయి జిల్లా కార్యదర్శి సాంకోట ఆదినారాయణ, తెలుగు తెలుగు మహిళా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, మండల యూత్ ప్రెసిడెంట్ హర్షవర్ధన్ చౌదరి, కో క్లస్టర్ ఇంచార్జ్ సాయి కుమార్, ఎస్సీ సెల్ నాయకులు కేసాపురం శంకర, బీసీ సెల్ నాయకులు శివ, యూనిట్ క్లస్టర్ ఇంచార్జ్ లు బూత్ కన్వీనర్లు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమాభివృద్ధిలో సీఎం చంద్రాబుదే ముందడుగు

## తొలి అడుగులో ధర్మరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరం, (చైతన్యరథం): రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా.. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెనక్కు తగ్గడం లేదని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. తాడిమర్రి మండలం శివంపల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలి అడుగు



కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్తూ ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఇంట్లో ఎంత మంది ఉన్నారు.. ఎవరెవరికి ఏ ఏ పథకాలు అందుతున్నాయన్నది వివరించారు. చాలా చోట్ల సంక్షేమ పథకాలపై హర్షం వ్యక్తమైంది. కొంత మంది పథకాలు రాలేదని చెప్పగా.. అందుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వీటిని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో సమస్యలు కూడా శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి ఏడాదే రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపించారని.. ఇంకా నాలుగేళ్లలో చేయాల్సింది చాలా ఉందన్నారు. ఇందుకు ప్రజల సహకారం కావాలని శ్రీరామ్ అన్నారు. బూత్ ఇన్ ఛార్జిలు డోర్ టూ డోర్ వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమం విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే పార్టీ ఉపేక్షించదన్నారు.

# కళ్ళున్న కబోధులు వైసీపీ నాయకులు



అనంతపురము, (చైతన్యరథం): సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసాద్ మున్నా నగర్‌లో ఇంటింటికి వెళ్లి పథకాల గురించి వివరించారు. ప్రజల నుంచి తమకు వస్తున్న స్పందన చూసి వైసీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. అనంత వెంకట్రామిరెడ్డికి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి కనిపించలేదా అని ప్రశ్నించారు. రుద్రంపేటలో వైసీపీ హయాంలో 100కు పైగా యాక్సిడెంట్లు జరిగాయన్నారు. కనీసం రోడ్డు వేయాలన్న జ్ఞానం కూడా వారికి లేదన్నారు. తాను నేను వచ్చాకనే ఆ రోడ్డు పడిందన్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో 350 కోట్లు రోడ్డు విస్తరణ కోసం వచ్చినా సిగ్గొదిలేసి తానే తెచ్చినట్టుగా, వైసీపీ నేత వెంకటరామిరెడ్డి తాను తెచ్చినట్లు ప్రచారం చేసుకున్నాడని ఎద్దేవా చేశారు. డంపింగ్ యార్డ్ తరలించకపోతే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పి సిగ్గులేకుండా బరిలోకి దిగాడన్నారు. రీకాల్ అంటూ జనంలోకి వస్తే తరిమి తరిమి కొడతారన్నారు.



ఆదోని, చైతన్యరథం): నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో ఏపీ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ నియోజకవర్గ పరిశీలకుడు ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



# ఎమ్మిగనూరులో ఇంటింటికీ టీడీపీ

## పాల్గొన్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, (చైతన్యరథం): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు పట్టణంలోని 33వ వార్డు లక్ష్మీపేటలో మంత్రి టీజీ భరత్‌తో కలిసి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని సమావేశమయ్యారు. సత్వర పరిష్కారానికి హామీ ఇచ్చారు. కూటమి ఏడాది పాలనా విజయాలను ప్రజలకు వివరించారు. పథకాలు, కార్యక్రమాలపై వారి అభిప్రాయం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఆత్మకూరులో....

ఆత్మకూరు, (చైతన్యరథం): మున్సిపాలిటీ రహమత్ నగర్ 13వ వార్డులో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కాలనీవాసుల ఇళ్లవద్దకు వెళ్ళి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఏడాది పాలనలో ప్రజల అభిప్రాయం సేకరించారు. పథకాల అమలులో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

## ప్యాపిలిలో..

11వ రోజు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్యాపిలి మండలంలోని బూరుగల గ్రామంలో ఇంటింటి ప్రచారంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.



## కదిరిలో....

కదిరి, (చైతన్యరథం): కదిరి మున్సిపల్ 18 వ వార్డు లో నిర్వహించిన సుపరిపాలనలో-తొలి అడుగు కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



## మంత్రి సవితను కలిసిన టీడీపీ నాయకులు

పెనుకొండ, చైతన్యరథం): పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో పలు సమస్యలపై మంత్రి సవితను ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శుభాంశు శుక్లాకు క్వారెంటైన్ స్వాగతం

**- అంతరిక్షంలో ఆరోగ్య పరీక్షలు.. భూమి మీద భద్రతా ఏర్పాట్లు**
**- రేపు తిరిగి రానున్న వ్యోమగాములు**



యాక్సియం-4 మిషన్లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా , మరో ముగ్గురు వ్యోమగాములు సోమవారం భూమికి తిరిగి రానున్నారు. ఈ నెల 15న కాలిఫోర్నియా తీరంలో వారు ల్యాండ్ అయిన వెంటనే వ్యోమగాములను ఏడు రోజుల పాటు క్వారంటైన్‌కు తరలించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. శుభాంశుతో పాటు పెగ్గి బిట్సన్, షావోస్ట్ ఉజ్నాన్స్కి, విన్ని యొస్కీ టీబర్ కపులు అంతరిక్షంలో భార రహిత స్థితిని అనుభవించిన కారణంగా భూ వాతావరణానికి వారి శరీరాలు అలవాటుపడేందుకు వీలుగా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు ఇస్రోకు చెందిన వైద్యాధికారులు వ్యోమగాముల ఆరోగ్యం. ఫిటినెస్‌ను నిరంతరం పర్యవేక్షిస్తారని అన్నారు. అంతరిక్షం నుంచి భూమికి బయల్దేరే ముందు కూడా వారికి పలు ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తారన్నారు. క్వారంటైన్‌లో ఉన్న వారం రోజుల్లో అంతరిక్ష యాత్ర వల్ల వ్యోమగాముల శరీరాలపై పడిన ప్రభావాన్ని వైద్యాధికారులు అధ్యయనం చేస్తారని తెలిపారు. వారి శరీరంలో రక్త ప్రవాహం, హృదయనాళాలు, మెదడుల పనితీరును అంతరిక్ష యాత్ర ఎలా ప్రభావితం చేసిందనే విషయాలను పరిశీలిస్తారన్నారు. యాక్సియం-4 మిషన్లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన భారత వ్యోమగామి శుభాంశు శుక్లా. మరో ముగ్గురు వ్యోమగాములు సోమవారం భూమికి తిరిగి రానున్నట్లు అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా వెల్లడించింది. యాక్సియం-4 మిషన్ ద్వారా శుభాంశుతో పాటు పెగ్గి విట్సన్, షావోస్ట్ ఉత్నాన్స్- చిన్నియెస్కి టిబర్ కవు ఫ్లోరిడాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి గతనెల 25న నింగిలోకి దూసుకెళ్లారు. 28 గంటల ప్రయాణం తర్వాత వారు ఐఎస్ఎస్ ప్రవేశించారు. దాదాపు రెండు వారాలుగా అక్కడ ఉన్న శుభాంశు శుక్లా ఏకంగా 96.5 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు యాక్సియం స్పేస్ వెల్లడించింది. వ్యోమగాములు ఇప్పటి వరకు దాదాపు 250 సార్లు భూమిని చుట్టి వచ్చారని వెల్లడించింది.

# విమాన ప్రమాదంపై పారదర్శకత లేని విచారణ

**నివేదికపై పైలట్ల సంఘం అభ్యంతరం - తొందర పడొద్దన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**



అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ఇచ్చిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్ అఫ్ ఇండియా ఖండించింది. విచారణ జరిగిన తీరు. నివేదికలో వివరాలు వెల్లడించిన విధానం పైలట్లదే తప్పిదమనే అర్థం గోచరించేలా పక్షపాత ధోరణిలో ఉందని తన ప్రకటనలో పేర్కొంది. మీడియాకు లీకయిన ఈ నివేదికపై బాధ్యతయుత స్థానంలో ఉన్న ఏ అధికారి సంతకమూ లేదు. ఈ దర్యాప్తులో ఎలాంటి పారదర్శకత కనిపించలేదు. అత్యంత గోప్యంగా జరిగిన ఈ ప్రక్రియ ఎంతగానో ఆశ్చర్యపర్చింది. నిపుణులైన మరీ ముఖ్యంగా లైన్ పైలట్లు (షెడ్యూల్డ్ ఫ్లైట్లు నడిపే వారు) ఆ దర్యాప్తులో భాగం కాలేదు' అని ఆల్ఫా అధ్యక్షుడు సామ్ థామస్ అన్నారు. విమానం ఇంజిన్ ఇంధన స్విచ్ అనుకోని కదలికలు దుర్ఘటనకు కారణమంటూ వాల్ స్ట్రీట్ జర్నల్లో వచ్చిన కథనాన్ని అసోసియేషన్ ప్రస్తావించింది. ఇలాంటి సున్నితమైన సమాచారం మీడియాకు లీక్ కావడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పారదర్శకత కోసం పరిశీలకులుగా తమను విచారణలో భాగం చేసుకోవాలని కోరింది..

జూన్లో జరిగిన ఘోర విమాన ప్రమాదంపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబి) 15 పేజీలతో తాజాగా ప్రాథమిక నివేదికను సమర్పించిన సంగతి తెలిసిందే. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలెట్.. మరో పైలట్‌ను ప్రశ్నించాడని నివేదికలో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ తెలిపింది. కాగా ఈ నివేదికపై ఇప్పటికే కేంద్రప్రభుత్వం నుంచి స్పందన వచ్చిన సంగతి తెలిసిందే.

**తుది నిర్ధారణకు రావద్దు : కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

"ప్రపంచంలోనే అత్యంత ప్రతిభ కలిగిన పైలట్లు, సిబ్బంది మన దగ్గర ఉన్నారు. వారు పౌర విమానయానానికి వెన్నెముక వంటివారు. ఈ రంగానికి వారే ప్రధాన వనరులు. వారి సంక్షేమం. శ్రేయస్సు కోసం మా ప్రభుత్వం పనిచేస్తుంది. ప్రమాదంపై అప్పుడే ఒక నిర్ధారణకు రావొద్దు. తుది నివేదిక వచ్చేవరకు వేచి చూడాలి. ఈ కేసులో ఎన్నో సాంకేతిక అంశాలు ఇమిడి ఉన్నాయి" అని మీడియా సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## నడిచొచ్చే శ్మశాన వాటిక

**సరఫరా చేస్తున్న కోయంబత్తూర్ కంపెనీ**

మారుతున్న కాలంలో పెరుగుతున్న ప్రజల అవసరాలు, సమస్యలకు పరిష్కారం చూపగలగటమే ఇంజినీరింగు వ్యవస్థకు సార్థకత. కోవిడ్ మహమ్మారి విజృంభించిన కష్టకాలంలో శవాలకు అంత్యక్రియల సమస్యను దేశమంతా ఎదుర్కొంది. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన ఓ కంపెనీకి ఈ సంక్షోభం నుంచి పుట్టిన ఆలోచనే చక్రాలపై శ్మశాన వాటిక, వాహనంలో తరలించేందుకు వీలుగా ఉన్న పోర్టబుల్ గ్యాస్ క్రిమేటర్లను వీరు రూపొందించి పలు రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. అరడుగుల పెట్టెలా కనిపించే ఈ గ్యాస్ క్రిమెటోరియంలో స్వయంచాలిత ఎల్పీజీ బర్నర్లు. పైప్‌లైన్ వ్యవస్థతో కూడిన ముందే చాంబర్ ఉంటుంది. మానవ మృతదేహాల దహనానంతరం అస్తికల సేకరణ సౌకర్యం కూడా ఇందులో ఉంది. కంట్రోల్ ప్యానల్ బోర్డు ద్వారా మూత ఉన్న దహన పద్ధతిలో ఇది పనిచేస్తుంది. ట్రక్కు వంటి వాహనాల్లో ఎక్కడికైనా సులభంగా దీనిని తరలించవచ్చు. మృతదేహాన్ని చాంబర్ లోపలికి పంపిన తర్వాత గ్యాస్ బర్నర్లను ఆన్ చేస్తారు. గంట నుంచి గంటన్నర వ్యవధిలో మృతదేహం అంత్యక్రియల ప్రక్రియ పూర్తవుతుంది. శ్మశాన వాటికల సమస్య ఉన్న కుగ్రామాలకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది.

## వైద్యుల నిర్వాకం

**డాక్టర్లు చనిపోయిందంటే.. నేను బతికే ఉన్నానని ఏడ్చిమరీ చెప్పిన బిడ్డ**




మహారాష్ట్రలో వైద్యుల నిర్వాకం బయటపడింది. ఓ నవజాత శిశువు మృతి చెందిందని వైద్యులు నిర్ధారించడంతో తల్లిదండ్రులు అంత్యక్రియలకు సిద్ధమయ్యారు. సరిగ్గా ఖననం చేసే సమయంలో ఆ శిశువు గట్టిగా ఏడవడంతో గ్రామస్థులంతా హతాశులయ్యారు. ఈ ఘటన మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. హెూల్ గ్రామానికి చెందిన ఓ మహిళ స్వామి రామానంద తీర్థ ఆసుపత్రిలో నెలలు నిండకముందే ఈ నెల 7వ తేదీన మగ బిడ్డకు జన్మనిచ్చింది.. శిశువును పరీక్షించిన వైద్యులు చనిపోయిందని ప్రకటించారు. దీంతో ఆ బిడ్డను గ్రామానికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు మరుసటి రోజు ఖననం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మనవడి ముఖాన్ని చూడాలని అమ్మమ్మ పట్టుబడడంతో.. ముఖంపై ఉన్న వస్త్రాన్ని తీసి చూసేసరికి ఒక్కసారిగా ఆ శిశువు ఏడవడం ప్రారంభించింది. దీంతో శిశువును హుటాహుటీన ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరిగిందని.. ఆసుపత్రి ముందు బంధువులు ఆందోళన చేశారు. ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆసుపత్రి ఇన్చార్జి డాక్టర్ రాజేష్ కచ్‌రే తెలిపారు.

## గోకర్ణ గుహల్లో రష్యన్ మహిళ

**- ఇద్దరు చిన్నారులతో నివాసం**
**- మిస్టరీగా మిగిలిన ఆమె జీవనం**



ఆధ్యాత్మికత కోసం వివిధ దేశాలకు చెందిన ఎంతోమంది భారత్‌కు రావడం ఇటీవల భారీగానే పెరిగింది. అలాగే వచ్చిన ఓ రష్యన్ మహిళ గోకర్ణలోని దట్టమైన అడవుల్లో రహస్య జీవనం సాగిస్తున్న విషయం వెలుగు చూసింది. ఓ చిన్న గుహలో ఆమెతో పాటు ఇద్దరు చిన్నారులు కూడా ఉండటం గమనార్హం. ఆమెకు నచ్చజెప్పి అక్కడ నుంచి బయటకు తీసుకువచ్చిన స్థానిక పోలీసులు సొంత దేశానికి తిప్పి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉత్తర కన్నడ జిల్లాలోని కుంటా తాలుకాలో దట్టమైన అడవులున్నాయి. అక్కడి రామతీర్థ పర్వత ప్రాంతంలో స్థానిక పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో ఓ గుహ వద్ద ఎవరివో దుస్తులు ఉన్నట్లు గమనించారు. దట్టమైన అడవి, కొండచరియలు విరిగిపడే ఆ ప్రమాదకరమైన ప్రాంతంలో ఎవరో నివాసం ఉండవచ్చనే అనుమానంతో ముందుకెళ్లారు. పైకి వెళ్లి చూడగా అక్కడున్న గుహలో ఓ మహిళ, ఇద్దరు చిన్నారులు కనిపించడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. రష్యాకు చెందిన ఆమెను నైనా కుటినా అలియాస్ మోహి (40)గా గుర్తించారు. ఆమెతో ఆరు. నాలుగేళ్ల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చిన నైనా హిందుత్వం, ఆధ్యాత్మికతకు ఆకర్షితురాలయింది. ఈ క్రమంలో గోవా నుంచి గోకర్ణకు వెళ్తున్న సమయంలో పర్వత ప్రాంతంలో ఓ ప్రదేశం ఆమెకు నచ్చింది. దట్టమైన అడవిలో ఉన్న గుహలో ఓ చిన్న నివాసం ఏర్పరచుకొంది. అక్కడే రుద్ర విగ్రహాన్ని పెట్టుకొని నిత్యం ఆరాధిస్తూ ప్రకృతి ఒడిలో ధ్యానంలో మునిగిపోయింది. ఆమెకు తోడుగా ఇద్దరు చిన్నారులు మాత్రమే ఉన్నారు. ఆ గుహ ఉన్న రామతీర్థ కొండల్లో 2024లో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. వన్యమృగాలు, అత్యంత విషపూరిత సర్పాలు ఉండే ఆ ప్రాంతంలో రెండు వారాలుగా ఆమె ఎలా నివసించారు. ఏం తిన్నారనే దానిపై పోలీసులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అదృష్టవశాత్తూ ఆమెకు ఎటువంటి అపాయం జరగలేదన్నారు. అయితే. ఆమె వీసా గడువు 2017లోనే ముగిసిందని, భారత్‌లో ఎప్పటి నుంచి ఉంటున్నారనే విషయంపై స్పష్టత లేదన్నారు. ప్రస్తుతానికి స్థానిక ఆశ్రమంలో ఉంచిన అధికారులు రష్యన్ ఎంబసీకి ఈ విషయాన్ని తెలియజేశారు. త్వరలోనే బెంగళూరుకు తరలిస్తామని, అక్కడ నుంచి ఆమె స్వదేశానికి పంపించే ఏర్పాట్లు చేస్తామని జిల్లా పోలీసులు వెల్లడించారు.

## నన్ను ఉరితీయండి

**కూతురు హత్య కేసు నిందితుడి పశ్చాత్తాపం**



హరియాణాకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి రాధికా యాదవ్ (25)ను తండ్రి దీపక్ యాదవ్ (49) హత్య చేసిన కేసులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. ఆవేశంలో కుమార్తెను చంపిన దీపక్ ఇప్పుడు కుమిలిపోతున్నారని అతడి కుటుంబం వెల్లడించింది. దీనిపై దీపక్ సోదరుడు విజయ్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఇది పెద్ద తప్పిదం. నేను దీపక్ వెంట పోలీసు స్టేషన్లో ఉన్నప్పుడు అతడు ఎంతో పశ్చాత్తాపంతో ఉన్నాడు. 'నన్ను ఉరితీసే విధంగా ఎఫ్ఐఆర్ రాయండి' అని పోలీసులకు చెప్పాడు.. నేను ఆడపిల్లను చంపేశానంటూ రోదించాడు" అని విజయ్ వెల్లడించారు. ప్రస్తుతం దీపక్‌ను రెండువారాల జ్యుడిషియల్ కస్టడీకి అప్పగించారు. రాధికా హత్యకేసులో ఎన్నో కోణాలు వెలుగు చూస్తున్నాయి. తన సంపాదనపై ఆధారపడి బతుకుతున్నారంటూ కుమార్తె అవహేళన చేయడంతోనే తండ్రి ఈ హత్యకు పాల్పడ్డారని మొదట వార్తలు వచ్చాయి. అయితే, ఆ కుటుంబంతో పరిచయం ఉన్నవారు మాత్రం ఆ కథనాల్లో వాస్తవం లేదని చెబుతున్నారు. రాధిక గతేడాది ఓ కళాకారుడితో కలిసి మ్యూజిక్ రీల్స్ చేసింది. ఈ ఉదంతం వారి కుటుంబంలో చిచ్చు రేపినట్లుగా తెలుస్తోంది. అలాగే రాధిక టెన్నిస్ అకాడమీని నిర్వహించడం కూడా తండ్రికి ఇష్టం లేకపోవడమే వారిద్దరి మధ్య ఘర్షణకు కారణమని వినవస్తోంది. అలాగే టెన్నిస్ ఆకాడమీని మూసివేయాలని దీపక్ అనేకసార్లు కోరినట్టు వార్తలు వస్తున్నాయి. అయితే, అందుకు ఆమె నిరాకరించిందని, రూ.2 కోట్లు ఖర్చు చేసి నేర్చుకున్న కెరీర్‌ను వదులుకోమని చెప్పడం సమంజసం కాదని

# ఏ క్షణమైనా బహిష్కరణ?

**- వీసా వస్తే సరిపోయినట్టు కాదంటున్న అమెరికా**
**- భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం హెచ్చరిక**







"వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ అయిపోయినట్టు కాదు. వారి ప్రతి కదలికనూ నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలను రద్దుచేసి దేశం నుంచి వెళ్లగొడతాం" . ఇదీ భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం ఎక్స్ వేదికగా పెట్టిన పోస్టు. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తుండటం తెలిసిందే. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగు'ను తప్పనిసరి చేసింది అమెరికా. అయితే, వీసా పొందిన తర్వాతా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం చేసిన హెచ్చరికలో భాగమే భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం పెట్టిన పోస్టు. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఫేస్‌బుక్, లింక్డిన్ ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలనూ, అందులో అభ్యర్థులు చేసిన పోస్టులు, కామెంట్లు, వెల్లడించిన అభిప్రాయాలనూ అగ్రరాజ్య అధికారులు పరిశీలిస్తారు.

అలాగని వాటిలో ఉన్న పోసులేవీ ఇప్పుడు డిలీట్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ అలా చేసినట్టు కనిపిస్తే పరిశీలన మరింత లోతుగా వెళ్లి తనిఖీ చేసే అవకాశం ఉంటుంది. ఈ వివరాలను ఇవ్వకపోతే వీసా తిరస్కరిస్తారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమైన ఆలోచనలు ఉన్నట్టు కనిపించిన వ్యక్తులను దేశంలోకి రాకుండా చూడటం కోసం ఈ 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అగ్రరాజ్యం తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

# నెట్ స్పీడులో జపాన్ తోపు!

**- సెకనుకు 1.02పెటాబిట్ల ప్రసా వేగం**
**- రెప్పపాటులో నెట్‌ఫ్లిక్స్ మొత్తం డౌన్‌లోడ్ చేయొచ్చట**



ఆధునిక విజ్ఞానశాస్త్ర చరిత్రలో జపాన్ అందుకొన్న మైలురాళ్లు కోకొల్లలు. తాజాగా ఇంటర్నెట్ రంగంలో కూడా తనకు సాటి లేదని నిరూపించిందా చిన్న దేశం. సెకనుకు 1.02 పెటాబిట్ల సమాచారం ప్రసారం చేయగల ఇంటర్నెట్ వేగాన్ని జపాన్ అభివృద్ధిచేసింది. దీని ద్వారా నెట్‌ఫ్లిక్స్ ఇప్పటివరకూ చేసిన ప్రసారాలన్నిటినీ ఒక సెకనులో డౌన్లోడ్ చేయవచ్చుట! ఇంగ్లీషులో వికీపిడియా ఇప్పటి వరకూ వెలువరించిన 100 గిగాబైట్ల మొత్తం సమాచారాన్ని ఒకే ఒక సెకనులో 10 వేలసార్లు డౌన్లోడ్ చేసుకోవచ్చుట!! జపాన్‌కు చెందిన నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్స్ టెక్నాలజీ (ఎన్ఐసీటీ) ఫొటానిక్ నెట్‌వర్క్ లేబరేటరీతో సంయుక్తంగా జరిపిన పరిశోధనల ఫలితంగా ఇది సాధ్యమైంది.

8 వేల వీడియోలను ఒక సెకనులో డౌన్లోడ్ చేసే సామర్థ్యం జపాన్ ఇంటర్నెట్ సొంతం. భారత్‌లో సరాసరి ఇంటర్నెట్ వేగం 66.55 ఎంబీపీఎస్ కాగా జపాన్ ఇంటర్నెట్ వేగం దానికన్నా 160 లక్షల రెట్లు ఎక్కువ. ఇంత వేగంతో రెప్పపాటులో నెట్‌ఫ్లిక్స్ లైబ్రరీ మొత్తాన్ని డౌన్లోడ్ చేసేయొచ్చు. తమదేశ ఇంటర్నెట్ స్పీడు అమెరికాలోని సగటు అంతర్జాల వేగంకన్నా 35 లక్షల రెట్లు ఎక్కువని ఎన్ఐసీటీ ఒక నివేదికలో పేర్కొంది. 19 పోగులు కలిగిన ఒక ప్రత్యేక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సాయంతో ఆ దేశం సెకనుకు 1,808 కిలోమీటర్ల వేగంతో డేటాను ప్రసారం చేయగలుగుతోంది. మన ప్రస్తుత ఇంటర్నెట్ మౌలిక సదుపాయాల్లో వినియోగించే 0.125 ఎంఎం మందం కలిగిన కేబుల్ సాయంతోనే 1.86 ఎగ్జాబిట్ల డేటాను ప్రసారం చేసే సత్తా సాధించారు. జపాన్ శాస్త్రవేత్తలు.

# మళ్లీ.. విరుచుకుపడిన రష్యా

**కీవ్ ఆయుధ పరిశ్రమపై 600 డ్రోన్లతో దాడులు**



ఉక్రెయిన్‌పై రష్యా భారీస్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్ ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది. ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్టు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు. రష్యా ప్రయోగించిన 319 డ్రోన్లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురు దాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జీఎంఎల్ఆర్ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

**అవన్నీ ఉ.కొరియా ఆయుధాలే!**

ఉక్రెయిన్‌పై సాగిస్తోన్న యుద్ధంలో రష్యాకు ఉత్తరకొరియా మద్దతుగా ఉన్న సంగతి తెలిసిందే. తమపై రష్యా ప్రయోగిస్తోన్న ఆయుధాలలో 40 శాతం ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించింది. ఉక్రెయిన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ అధ్యక్షుడు కైరులా బుడనోవ్ ఈవిషయాన్ని బయటపెట్టారు. గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల మధ్య మిలిటరీ ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో భాగంగా ఉ.కొరియా అనేక బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలను మాస్కోకు చేరవేస్తున్నట్టు తెలిపారు. దీనికి బదులుగా రష్యానుంచి పెద్దమొత్తంలో నగదు, టెక్నాలజీని ఉత్తరకొరియా పొందుతున్నట్టు వెల్లడించారు. ఈసందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందం వీలైనంత త్వరగా జరగాలని బుడనోవ్ ఆశాభావం వ్యక్తంచేశారు. ఇదిలావుంటే, యుద్ధంలో రష్యాకు బేషరతుగా మద్దతిస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు. మిలిటరీ ఒప్పందం నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సైనిక సంబంధాలు తీవ్రంగా బలపడ్డాయి. ఈ క్రమంలో మరో 30వేల మంది సైనికులను మాస్కోకు మద్దతుగా పంపేందుకు కిమ్ సిద్ధమైనట్టు ఇటీవల వార్తలు వచ్చాయి. గతేడాది కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ సేనలు చొచ్చుకురావడంతో.. నవంబర్‌లో దాదాపు 11,000 మంది సైనికులను కిమ్ ప్రభుత్వం పంపించింది.

# ఇరాన్‌లో బహిరంగ ఉరి

***బాలికపై అత్యాచార ఘటనలో దోషికి శిక్ష***



మహిళలపట్ల నేరాలకు పాల్పడితే ఇరాన్ ప్రభుత్వం ఎంతటి కఠిన శిక్షలు అమలు చేస్తుందో తెలియజెప్పే ఘటన ఇది. ఓ బాలికను హత్యాచారం చేసిన కేసులో దోషిగా తేలిన వ్యక్తికి ఇరాన్ అధికారులు బహిరంగంగా మరణశిక్ష విధించారు. ఈమేరకు స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. వాటి ప్రకారం.. బుకాన్‌కు చెందిన బాలికను అత్యాచారం, హత్య చేసిన కేసులో ఓ వ్యక్తి దోషిగా తేలాడు. అతడికి బహిరంగంగా మరణశిక్ష విధించాలని బాధిత కుటుంబసభ్యులు, ప్రజలనుంచి పెద్దఎత్తున అభ్యర్థనలు వచ్చాయి. మార్చిలో అతడికి మరణశిక్ష ఖరారు కాగా.. సుప్రీంకోర్టు కూడా దాన్ని సమర్థించింది. భావోద్వేగాలతో ముడిపడిన కేసు కాబట్టి కఠినశిక్షపై నిర్ణయం తీసుకున్నామని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యుల కోరిక మేరకు శిక్షను విధిస్తున్నట్టు చెబుతూ తాజాగా దాన్ని అమలు చేశారు. ఇరాన్ బహిరంగంగా మరణశిక్షలు విధించడం సాధారణమే. హత్య, అత్యాచారంవంటి తీవ్రత ఎక్కువున్న కేసుల్లో ఇలాంటి కఠినమైన శిక్షలను అమలుచేస్తారు. మానవ హక్కుల సంఘాల ప్రకారం.. ప్రపంచంలో ఎక్కువ మరణశిక్షలు అమలుచేసే దేశాల్లో ఇరాన్ రెండోస్థానంలో ఉంది. మొదటి స్థానంలో చైనా ఉంది.

# చైనాలో వింత సంప్రదాయం

**బతికున్న తల్లిని శవపేటికలో ఊరేగించిన కొడుకు**



ప్రాణాలతో ఉన్న తన తల్లిని ఓ వ్యక్తి శవపేటికలో ఊరేగించిన వింత ఘటన చైనాలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. చైనాలోని హునాన్ ప్రావిన్స్‌కు చెందిన వ్యక్తి 70 ఏళ్ల వయసున్న తన తల్లి కోసం ఇటీవల ఓ శవపేటికను కొనుగోలు చేశాడు. శవపేటికను మోయడానికి 16 మందిని నియమించుకొని.. ఆమెను అందులో కూర్చోబెట్టి డప్పుచప్పుళ్లతో ఊరేగించాడు. అనంతరం ఆమెను ఇంటికి తీసుకెళ్లి అందరికీ విందు భోజనం పెట్టారు. దీనికి సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారడంతో సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చైనాలోని కొన్ని ప్రాంతాలలో ఎన్నో ఏళ్లుగా ఈ వింత సంప్రదాయాన్ని పాటిస్తారు. వృద్ధులను ఈ విధంగా శవపేటికల్లో ఊరేగించడాన్ని పిల్లలు, తల్లిదండ్రులపై చూపే ప్రేమకు చిహ్నంగా అక్కడి వారు భావిస్తారు. అంతేకాకుండా శవపేటికలో ఊరేగించడం వల్ల వృద్ధులు దీర్ఘాయుష్షుతో జీవిస్తారని ప్రజల విశ్వాసం. శవపేటికలను చైనాలో అదృష్టానికి చిహ్నంగా భావిస్తారు. చాలా గ్రామాలలోని వృద్ధులు తమ సొంత శవపేటికలను సిద్ధం చేసుకొని ఇళ్లల్లో దాచుకుంటారట.

# తొలి ఇన్నింగ్స్‌లో స్కోర్లు సమం

**- రాహుల్ సెంచరీ, రాణించిన పంత్, జడేజా**

**- ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ 2/0**





ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడో టెస్టులో భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసింది. మూడో రోజు శనివారం ఆట ముగిసేసరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్లేమీ నష్టపోకుండా రెండు పరుగులు చేసింది. అంతకుముందు టీమిండియా మొదటి ఇన్నింగ్స్‌లో 387 పరుగులకు ఆలౌటైంది. దీంతో తొలి ఇన్నింగ్స్‌లో భారత్- ఇంగ్లాండ్ స్కోర్లు సమం అయ్యాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ సైతం అన్నే పరుగులకు ఆలౌటైంది. ఇక భారత్ బ్యాటర్లలో కే ఎల్ రాహుల్ (100) సెంచరీతో అదరగొట్టాడు.

రిషబ్ పంత్ (74 పరుగులు), రవీంద్ర జడేజా (72 పరుగులు) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. కరుణ్ నాయర్ (40 పరుగులు), నితీశ్ రెడ్డి (30 పరుగులు) ఫర్వాలేదనిపించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 3, బెన్ స్టోక్స్ , జోఫ్రా ఆర్చర్ తలో 2, షోయబ్ బషీర్, బ్రైడన్ కార్స్ చెరో 1 వికెట్ దక్కించుకున్నారు.

145-3 ఓవర్ నైట్ స్కోర్‌తో టీమిండియా మూడో రోజు ఆట ప్రారంభించింది. తొలుత రాహుల్- పంత్ నాలుగో వికెట్‌కు 141 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అటు 53 పరుగుల వ్యక్తిగత స్కోర్‌తో బ్యాటింగ్ ప్రారంభించిన రాహుల్ మరో 47 రన్స్ జోడించి సెంచరీ పూర్తి చేశాడు. టెస్టుల్లో రాహుల్‌కు ఇది 10వ సెంచరీ. లార్డ్స్‌లో రెండోది. ఇక సెంచరీ పూర్తైన వెంటనే రాహుల్ ఔటయ్యాడు.

మరోవైపు పంత్ హాఫ్ సెంచరీ పూర్తయ్యాక, 74 పరుగుల వద్ద అనుకోకుండారనౌట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జడేజా అద్భుతంగా ఆడాడు. నితీష్ కుమార్‌తో కలిసి జడ్డూ వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. ఈ ఇద్దరూ 72 పరుగులు జోడించారు. నితీశ్ 30 పరుగులు వద్ద ఔట్ అయ్యాడు. అటు జడ్డూ కూడా 72 రన్స్ వద్ద పెవిలియన్ చేరాడు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (23 పరుగులు, 76 బంతుల్లో) ఆకట్టుకున్నాడు.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 387 పరుగులకు ఆలౌటైంది. స్టార్ బ్యాటర్ రూట్ (104 పరుగులు) సెంచరీ సాధించాడు. బ్రైడన్ కార్స్ (56) జెమీ స్మిత్ (51) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకున్నారు. టీమ్ఇండియాలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అదరగొట్టాడు. ఐదు వికెట్లతో ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్ తలో 2, రవీంద్ర జడేజా 1 వికెట్ పడగొట్టారు.

అయితే ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఇరు జట్ల స్కోర్లు సమం అయ్యాయి. 148 ఏళ్ల టెస్టు చరిత్రలో ఇలా తొలి ఇన్నింగ్స్‌లో రెండు జట్ల స్కోర్లు సమం అవ్వడం ఇది తొమ్మిదో సారి కావడం విశేషం.

**లార్డ్స్‌లో రాహుల్ అరుదైన ఘనత**

క్రికెట్‌కు పుట్టినిల్లుగా భావించే లండన్‌లోని లార్డ్స్ మైదానంలో టీమిండియా ఓపెనర్ కేఎల్ రాహుల్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అత్యంత పురాతనమైన ఈ స్టేడియంలో మెరుగైన ప్రదర్శన చేయడాన్ని క్రికెటర్లందరూ ఓ గౌరవంగా భావిస్తుంటారు. ప్రస్తుతం ఈ మైదానంలోనే భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో 176 బంతులు ఆడిన రాహుల్ 100 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ సెంచరీతో కేఎల్ రాహుల్ పలు అరుదైన ఘనతలు సాధించాడు. లార్డ్స్ మైదానంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ సెంచరీలు చేసిన నాలుగో విదేశీ ఓపెనర్‌గా కేఎల్ రాహుల్ నిలిచాడు. 2021లో లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో కూడా రాహుల్ (129 పరుగులు) సెంచరీ నమోదు చేశాడు. తాజాగా లార్డ్స్ మైదానంలో రెండో సెంచరీ సాధించాడు. రాహుల్ కంటే ముందు లార్డ్స్ మైదానంలో బిల్ బ్రౌన్ (ఆస్ట్రేలియా), గోర్డాన్ గ్రీనిడ్జ్ (వెస్టిండీస్), గ్రేమ్ స్మిత్ (దక్షిణాఫ్రికా) రెండు కంటే ఎక్కువ సెంచరీలు చేసిన పర్యాటక జట్ల ఓపెనర్లు.

అలాగే లార్డ్స్ మైదానంలో రెండు సెంచరీలు చేసిన తొలి ఆసియా జట్టు ఓపెనర్‌గా కూడా రాహుల్ రికార్డు సృష్టించాడు. జట్టు కష్టాల్లో ఉన్న దశలో ఆదుకున్న కేఎల్ రాహుల్ (100), రిషబ్ పంత్‌తో కలిసి (74) నాలుగో వికెట్‌కు 141 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

# వింబుల్డన్ కొత్త క్వీన్ స్వైటెక్

**- ఏకపక్షంగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్ మ్యాచ్**

**- 6-0, 6-0తో అనిసిమోవాపై స్వైటెక్ ఘనవిజయం**



వింబుల్డన్‌లో మరో కొత్త మహిళా ఛాంపియన్ అవతరించింది. శనివారం ఏక పక్షంగా సాగిన మహిళల సింగిల్స్ ఫైనల్స్‌లో అమండా అనిసిమోవా (అమెరికా)ను చిత్తుగా ఓడించి ఇగా స్వైటెక్ (పోలెండ్) టైటిల్ గెలుచుకుంది. 6-0, 6-0తో వరుస సెట్లలో స్వైటెక్ ఫైనల్స్‌లో విజయం సాధించగా.. అనిసిమోవా ఏ దశలోనూ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. తొలినుంచీ దూకుడుగా ఆడిన స్వైటెక్ ధాటికి అనిసిమోవా ఒక్క గేమ్ కూడా గెలవలేకపోవటం విశేషం.

24 ఏళ్ల స్వైటెక్ ఇప్పటివరకు 5 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు గెలిచింది అందులో నాలుగు ఫ్రెంచ్ ఓపెన్, ఒక యుఎస్ ఓపెన్ ఉన్నాయి. ఇంత వరకు వింబుల్డన్‌కు గెలవలేకపోయిన ఆమె కెరీర్లో తొలిసారి ఈ టోర్నీలో ఫైనల్‌కు చేరింది. గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో ఇప్పటివరకు ఓటమనేది ఎరగని స్వైటెక్ ఆ ఒరవడిని నిలబెట్టుకుంటూ ఈ సారి కూడా ఘన విజయం సాధించి తొలిసారి వింబుల్డన్ కప్‌ను ముద్దాడింది. తద్వారా తన గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల సంఖ్యను ఆరుకు పెంచుకుంది. మరోపక్క తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌కు చేరిన 23 ఏళ్ల అనిసిమోవాకు తుదిమెట్టు ముందు భోల్తాపడింది.

వింబుల్డన్‌లో కొత్త ఛాంపియన్ రావడం వరుసగా ఎనిమిదో ఏడాది కావటం విశేషం. సెరెనా విలియమ్స్ (2015, 16) తర్వాత మరో ప్లేయర్ టైటిల్‌ను నిలబెట్టుకోలేకపోయింది. సెరెనా తర్వాత ముగురుజ (స్పెయిన్, 2017), కెర్బర్ (జర్మనీ, 2018), హాలెప్ (రొమేనియా, 2019), బార్టీ (ఆస్ట్రేలియా, 2021), రిబకినా (కజకిస్థాన్, 2022), వోండ్రుసోవా (చెక్, 2023), క్రెజికోవా (చెక్, 2024) వింబుల్డన్ ట్రోఫీ గెలిచారు.

# లార్డ్స్ టెస్టులో డ్యూక్ బంతి వివాదం

***- భారత్-ఇంగ్లండ్ మ్యాచ్ క్రూరంగా సాగుతోంది: జో రూట్***





భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ చాలా చర్చనీయాంశంగా మారింది. రెండో రోజు బంతి మార్పుపై పెద్ద వివాదం చెలరేగింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్ల తర్వాత రూల్స్ ప్రకారం భారత్ కొత్త బంతిని అందుకుంది. అయితే 10 ఓవర్లు పూర్తయ్యేసరికే బంతి ఆకారం దెబ్బతిన్నది. భారత ఆటగాళ్ల ఫిర్యాదులో బంతిని పరిశీలించిన అంపైర్ మరో బాల్‌ను తెప్పించాడు. 10 ఓవర్లు మాత్రమే ఆడిన బాల్ తీసుకొచ్చాడు. అయితే ఈ బంతి పాతదానికి కంటే మరి ఘోరంగా ఉండటంతో భారత ఆటగాళ్లు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదే విషయాన్ని అంపైర్‌కు చెప్పే ప్రయత్నం చేయగా.. అతను వినిపించుకోలేదు. దాంతో మరింత అసహనానికి గురైన గిల్.. అంపైర్‌తో గొడవపడ్డాడు. ఇప్పుడు జో రూట్ దీనిపై స్పందించాడు.

**డ్యూక్ బాల్ వివాదంపై జో రూట్ ప్రకటన**

ప్రెస్ కాన్ఫరెన్స్‌లో జో రూట్ బంతి మార్పుపై మాట్లాడాడు. టీమిండియా తీరుపై రూట్ ప్రశ్నలు లేవనెత్తాడు. డ్యూక్స్ బంతి మార్పుపై ఇంత చర్చ అవసరం లేదని జో రూట్ అభిప్రాయపడ్డాడు. జో రూట్ మాట్లాడుతూ.. "ఒక వేళ బంతి ఆకారం దెబ్బతింటే దానిని మార్చుకోవాలి. కానీ దీనిపై ఎటువంటి రాద్ధాంతం చేయకూడదు. ఇక్కడ ప్రపంచం అంతమైపోయిందని నేను అనుకోవడం లేదు. ఇది ఆటలో ఒక కొత్త మలుపు తీసుకువస్తుందని నేను భావిస్తున్నాను. మార్పులకు అనుగుణంగా మారే సామర్థ్యం మీకు ఉండాలి. దాని వల్ల స్వింగ్ ఆగిపోయినా లేదా మరింత పెరిగినా సరే రాణించే కెపాసిటీ ఉండాలి." అంటూ జో రూట్ అభిప్రాయపడ్డాడు.



**మేజర్ లీగ్ క్రికెట్ 2025**

## ఫైనల్‌కి దూసుకెళ్లిన న్యూయార్క్

***టెక్సాస్ సూపర్ కింగ్స్‌పై ఘన విజయం***


మేజర్ లీగ్ క్రికెట్ 2025 టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా కొనసాగుతున్న తరుణంలో, ఎంఐ న్యూయార్క్ జట్టు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. డల్లాస్ వేదికగా జులై 11న జరిగిన చాలెంజర్ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్‌ను ఏకంగా 7 వికెట్ల తేడాతో ఓడించి, ఎంఐ న్యూయార్క్ రెండోసారి ఫైనల్‌కు అర్హత సాధించింది. టాస్ గెలిచిన న్యూయార్క్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన టెక్సాస్ సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 166 పరుగులు చేసింది. కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ 42 బంతుల్లో 59 పరుగులు చేసి స్థిరత చూపించగా, అకీల్ హుస్సేన్ 32 బంతుల్లో 55 పరుగులు, డొనొవాన్ ఫెరీరా 20 బంతుల్లో 32 పరుగులతో మెరిశారు. న్యూయార్క్ బౌలింగ్ విభాగంలో ట్రిస్టన్ లస్ 3 వికెట్లు పడగొట్టి టెక్సాస్‌కు చికాకులు కలిగించాడు. రిషిల్ ఉగార్కర్ 2 వికెట్లు తీసి మద్దతుగా నిలిచాడు.

167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఎంఐ న్యూయార్క్ ఆరంభంలో కొంత అస్థిరతను ఎదుర్కొన్నది. స్టార్ ఓపెనర్ క్వింటన్ డికాక్ కేవలం 6 పరుగులకే వెనుదిరిగాడు. వన్ డౌన్‌లో వచ్చిన మైఖేల్ బ్రేస్ వెల్ 8 పరుగులకే పెవిలియన్ చేరాడు. కానీ మరో ఓపెనర్ మోనాంక్ పటేల్ 39 బంతుల్లో 49 పరుగులతో బలమైన పునాది వేశాడు. అతనికి తోడుగా నికోలస్ పూరన్ తన క్లాసీ బ్యాటింగ్‌తో షైన్ చేశాడు. పూరన్ 36 బంతుల్లో 52 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్ కీలక దశలో వచ్చిన కీరన్ పొలార్డ్, తనదైన పవర్ హిట్టింగ్‌తో టెక్సాస్ బౌలర్లను చిత్తు చేశాడు. కేవలం 22 బంతుల్లో 213.64 స్ట్రైక్ రేట్‌తో 47 పరుగులు చేసి, జట్టును విజయం దిశగా నడిపించాడు. ఈ ఇద్దరి మధ్య జరిగిన అజేయ భాగస్వామ్యం వల్ల ఎంఐ న్యూయార్క్ 19వ ఓవర్‌లో లక్ష్యాన్ని చేధించింది. టెక్సాస్ బౌలర్లలో అకీల్ హుస్సేన్, జియా ఉల్ హక్, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.

లీగ్ దశలో న్యూయార్క్ ప్రదర్శన తేలికపాటిగా కనిపించినా, ప్లేఆఫ్ దశలో తాము ఎందుకు బలమైన జట్టో మరోసారి నిరూపించింది. అద్భుతమైన ప్రదర్శనతో ఫైనల్ టికెట్ సొంతం చేసుకున్న న్యూయార్క్ జట్టు, ఇప్పుడు టైటిల్ గెలవాలనే ధ్యేయంతో ముందుకు సాగుతోంది. జులై 13న సోమవారం తెల్లవారుజామున 5:30 గంటలకు, వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుతో తుది సమరానికి సిద్ధమవుతోంది. వాషింగ్టన్ జట్టు టోర్నమెంట్ ప్రారంభం నుంచి అదరగొడుతూ, ఫేవరెట్‌గా నిలవగా, ఎంఐ న్యూయార్క్ ఫామ్‌లోకి రావడంతో ఫైనల్ ఉత్కంఠతకు కేంద్రబిందువుగా మారింది. కీరన్ పొలార్డ్, నికోలస్ పూరన్ లాంటి మ్యాచ్ విన్నర్స్ జట్టులో ఉండటం, అభిమానులకు హోరాహోరీ పోరుకు మేలు సూచనలుగా మారింది.

# షార్ట్‌ఫిల్మ్స్‌గా భగవద్గీత






పురాణాలు, ఇతిహాసాలపై ఇండస్ట్రీలో ఆసక్తి కనిపిస్తోంది. వీటి ఆధారంగా ఇప్పటికే కొన్ని సినిమాలు ప్రేక్షకాదరణను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. మరికొన్ని భారీ స్థాయిలో రూపొందుతున్నాయి. తాజాగా దర్శకుడు రామ్ మాధ్వాని ఏఐని ఉపయోగించి భగవద్గీతపై షార్ట్‌ఫిల్మ్ రూపొందించినట్లు చెప్పారు. రెండేళ్లు కష్టపడి దీన్ని అభివృద్ధి చేశా. దీనికోసం వీఆర్ (వర్చువల్ రియాలిటీ), ఏఐ (కృత్రిమ మేధస్సు)లను ఉపయోగించా. ఇప్పటికే ఈ షార్ట్ ఫిల్మ్‌ను ప్రైవేట్ ప్రివ్యూలలో ప్రదర్శించా. ఇది కేవలం ఐదు నిమిషాల నిడివి ఉన్నప్పటికీ ఇందులో భగవద్గీతలోని 18 అధ్యాయాలను చూపినట్లు తెలిపారు. "కొన్ని శతాబ్దాలుగా అందుబాటులో ఉన్న ఇతిహాసాలు, గ్రంథాలకు మించిన కథలేముంటాయి' అంటున్నారు మాధ్వానీ. కేవలం పౌరాణిక కంటెంట్‌ను చూపించడం మాత్రమే కాదు.. ప్రేక్షకులను ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమన్నారు. 'లెట్స్ టాక్' చిత్రంతో దర్శకుడిగా మారిన రామ్ మాధ్వానీ ఆ తర్వాత 'నీర్జా', 'ధమాకా' వంటి చిత్రాలతో పాటు, 'ఆర్య', 'ది వాకింగ్ ఆఫ్ ఏ నేషన్' వంటి వెబ్‌సిరీస్‌లను తెరకెక్కించారు. ఇతిహాసాల ఆధారంగా వరుస ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయి. తాజాగా విడుదలైన 'రామాయణ' గ్లింప్స్‌కు భారీ స్పందన లభించింది. అలాగే ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిల్మ్స్ పురాణాల ఆధారంగా ఏడు సినిమాలను నిర్మించనున్నట్లు ఇటీవల ప్రకటించింది.



## రాష్ట్రపతి వీక్షించిన 'తన్వి ది గ్రేట్'

అనుపమ్ ఖేర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తన్వి ది గ్రేట్'. తాజాగా ఈ చిత్రాన్ని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వీక్షించారు. రాష్ట్రపతి భవన్‌లో ఆమె కోసం ఈ చిత్రాన్ని ప్రత్యేకంగా ప్రదర్శించారు. రాష్ట్రపతితో పాటు చిత్రబృంద సభ్యులు ఈ ప్రదర్శనను వీక్షించారు. దీనికి సంబంధించిన ఫొటోలను అనుపమ్ ఖేర్ పంచుకున్నారు. "భారత త్రివిధ దళాల అధిపతి సుప్రీం కమాండర్ మా సినిమాను చూడడం గర్వంగా ఉంది. సినిమా పూర్తయ్యాక చివర్లో ఆమె చప్పట్లు కొట్టడం చూసి నా కల నిజమైందని అనుకున్నాను. ఒక దర్శకుడిగా ఇంతకు మించి ఏం ఆశించగలను" అంటూ ఆనందం వ్యక్తంచేశారు.

భారత సాయుధ దళాల ధైర్యం, త్యాగాలకు నివాళిగా రూపొందిన చిత్రం 'తన్వి ది గ్రేట్'. శుభాంగి దత్ ప్రధానపాత్ర పోషించారు. 2002లో వచ్చిన 'ఓం జై జగదీష్' సినిమా తర్వాత అనుపమ్ మళ్లీ ఇప్పుడు 'తన్వి ది గ్రేట్'కు దర్శకత్వం వహించారు. చిత్రంలో జాకీ ష్రాఫ్, అరవింద స్వామి, బొమన్ ఇరానీ, పల్లవి జోషి, నాజర్ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు. జులై 18న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది.



## అందుకే.. అతన్ని కొట్టాను

"గతంలో ఓ వ్యక్తి నాతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇబ్బందికరంగా తాకాడు. నాకెంతో కోపం వచ్చింది. వెంటనే అతడిని కొట్టాను. ఆ వ్యక్తి కూడా నన్ను తిరిగి కొట్టాడు. అతడు నాతో ఇబ్బందికరంగా వ్యవహరించడం వల్లే కొట్టాను. తప్పు చేసినప్పటికీ అతడు కోపంతో నన్ను తిరిగి కొట్టడం నన్నెంతో బాధించింది" అంటూ గత అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు నటి సనా ఫాతిమా షేక్. ఇలాంటి వేధింపులను మహిళలు ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో ఎదుర్కొంటూనే ఉన్నారన్నారు. ఈ ఘటన తర్వాత ఒక విషయంలో తనకెంతో అవగాహన వచ్చిందన్నారు. ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు ఏవిధంగా రియాక్ట్ కావాలో తెలుసుకున్నానని చెప్పారు. "మనకు ఏదైనా సమస్య ఎదురైనప్పుడు దానిని ఎలా ఎదుర్కోవాలనేది పూర్తిగా మనపైనే ఆధారపడి ఉంటుంది" అని ఆమె తెలిపారు. 'దంగల్'తో ఒకప్పుడు ప్రేక్షకులను అలరించిన ఫాతిమా నటించిన రీసెంట్ ప్రాజెక్ట్ 'ఆప్ జైసా కోయి'.



## బన్నీ-అట్లీ సరికొత్త ప్రయోగం

అట్లీ డైరెక్షన్‌లో అల్లు అర్జున్ చేస్తోన్న తాజా ప్రాజెక్టు ఏఏ-22 (వర్కింగ్ టైటిల్). బన్నీ క్యారెక్టర్‌కు సంబంధించి అట్లీ డిజైన్‌పై కొన్నిరోజులుగా కథనాలు చక్కర్లు కొడుతుండటం తెలిసిందే. వైవిధ్యమైన రెండు పాత్రల్లో బన్నీని చూపించనున్నట్టు ప్రచారం జరిగినా.. తాజా టాక్ అల్లు అర్జున్ ఫ్యాన్స్‌ని సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మూడు తరాలకు చెందిన నలుగురు వ్యక్తుల పాత్రల్లో బన్నీ కనిపించేలా అట్లీ డిఫరెంట్ క్యారెక్టర్స్‌ను డిజైన్ చేసినట్టు బాలీవుడ్ మీడియాలో కథనాలు జోరందుకున్నాయి. తాత, తండ్రి, ఇద్దరు కుమారులుగా బన్నీ స్క్రీన్‌పై సందడి చేస్తాడని టాక్. అట్లీ ఐడియాకు ఫిదా అయిన బన్నీ సైతం ఆయా లుక్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సన్నద్ధమవుతున్నట్టు సమాచారం. హీరో లుక్కుకు సంబంధించి టీమ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఒకవేళ తాజాగా వచ్చిన కథనాలే నిజమైతే.. ఒక సినిమాలో విభిన్నమైన పాత్రల్లో నటించడం ఇదే తొలిసారి కానుండటం విశేషం. సమాంతర ప్రపంచం, పునర్జన్మల కాన్సెప్ట్‌తో ముడిపడివుండే సైన్స్ ఫిక్షన్‌గా సినిమా ముస్తాబు కానుందట. దీనికోసం చిత్రబృందం ఓ కొత్త ప్రపంచాన్నే సృష్టించే పనిలో ఉంది. హాలీవుడ్‌కు చెందిన ప్రముఖ వీఎఫ్‌ఎక్స్ సంస్థ ఈ సినిమా కోసం రంగంలోకి దిగింది. అంతర్జాతీయ ప్రమాణాలతో భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ దీన్ని నిర్మిస్తోంది. మొత్తం ఐదుగురు హీరోయిన్లు నటించనున్నట్లు టాక్. అందులో ఒకరు దీపికా పదుకొణె అని టీమ్ స్పష్టతనిచ్చింది. మిగిలిన హీరోయిన్స్‌కు సంబంధించి జాన్వీకపూర్, మృణాల్ ఠాకూర్, రష్మిక, భాగ్యశ్రీ బోర్సే పేర్లు వినిపిస్తున్నాయి. హాలీవుడ్‌కి చెందిన అగ్ర హీరోని ఇందులో ఓ కీలక పాత్ర కోసం సంప్రదించినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది.

## తిండిలేని రోజులు చూశా..



'జై లవకుశ'లో విలన్‌గా ఆడియన్స్ మెప్పుపొందిన నటుడు రోనిత్ రాయ్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇండస్ట్రీలోకి రాకముందు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నానని, తిండిలేని పరిస్థితి చవిచూశానని గుర్తు చేసుకున్నారు. "ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కొత్తలో అనుకున్న విజయాలు అందలేదు. అవకాశాలూ రాలేదు. మొదట్లో ఎక్కువగా ఆలోచించినా.. క్రమంగా అలవాటుపడి పట్టించుకోవడం మానేశా. అవకాశమివ్వమని అడగకపోవడం కూడా కారణమై ఉండొచ్చని నాకు నేనే సర్దిచెప్పుకునేవాడిని" అన్నారు. అసలు "సినిమాల్లోకి రాకముందైతే డబ్బుల్లేక ఇబ్బందిపడిన సందర్భాలు ఎన్నో. తినడానికి కూడా సరిపడా డబ్బు ఉండేది కాదు. కొన్నిసార్లు ఒక్కపూట భోజనమే. నాకు ఇప్పటికీ గుర్తు బాంద్రా స్టేషన్ దగ్గరలో ఉన్న ఒక దాబాలో ప్రతిరోజూ రెండు రోటీలు, కూర తినేవాడిని. ఓసారి నా వద్ద డబ్బుల్లేక కేవలం రోటీలు మాత్రమే తీసుకున్నా. విషయం అర్థం చేసుకున్న షాపు యజమాని కూర కూడా ఇచ్చారు. 'ఇదేంటి? అని అడిగితే.. 'మీరు రోజూ రోటీ, కర్రీ తీసుకుంటారు కదా. ఈరోజు కూడా అలాగే తినండి. డబ్బుల్లేకపోయినా ఫర్వాలేదు' అన్నాడు. అతని ముఖం నాకింకా గుర్తుంది" అంటూ కంటతడి పెట్టుకున్నారు రోనిత్. తాను నటించిన తొలి చిత్రం 'జాన్ తేరే నామ్'కు రూ.50,000 పారితోషికం అందుకున్నానని గుర్తు చేసుకున్నారు. అలా వచ్చిన పారితోషికం తన ఖర్చులకు సరిపోయేదన్నారు. 'అర్జీ', 'స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్', 'అగ్లీ' తదితర చిత్రాల్లో నటించిన రోనిత్.. 'లైగర్'లోనూ కీలకపాత్ర పోషించారు.

## ఆన్‌స్క్రీన్ రొమాన్స్ ఇక చేయనేమో



'ఆప్ జైసా కోయి' రొమాంటిక్ కామెడీతో ఆడియన్స్ ముందుకొచ్చారు ఆర్. మాధవన్. ఫిమేల్ లీడ్ రోల్‌ను ఫాతిమా సనా షేక్ పోషించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా సినిమా స్ట్రీమింగ్ అవుతోంది. 55ఏళ్ల మాధవన్, చిన్న వయసు నటితో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించి వార్తల్లో నిలిచారు. అయితే, తాజాగా మాధవన్ చేసిన కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. ఇకపై తాను రొమాంటిక్ సినిమాల్లో నటించబోనని స్పష్టంచేశారు. "ఆప్ జైసా కోయి" ప్రారంభించినప్పుడు నేను రొమాంటిక్ సినిమాల్లో నటించగలననే భావనలో ఉన్నాను. అందుకే ఈ వయసులోనూ ఆ కథను అంగీకరించాను. ఇప్పుడు నా ఏజ్‌కు తగిన సినిమాలనే ఎంచుకోవాలని అనుకుంటున్నాను. ఇకపై రొమాంటిక్ సినిమాలను పూర్తిగా వదిలేస్తానేమో. చివరి అవకాశంగా ఇలాంటి చిత్రంలో నటించాను" అని అన్నారు. ఇండస్ట్రీలోని రొమాంటిక్ హీరోల్లో ఒకరైన మాధవన్ ఇలాంటి కామెంట్స్ చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కొన్నిరోజులుగా వైవిధ్యమైన పాత్రలనే ఎంచుకుంటున్న మాధవన్.. మొన్నటి 'షైతాన్' మూవీలో విలన్‌గానూ మెప్పించారు. ఇక 'ఆప్ జైసా కోయి' విషయానికొస్తే.. కరణ్ జోహార్ నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ వేదికగా జులై 11న అందుబాటులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల ద్వారా 40 ఏళ్ల వ్యక్తితో ప్రేమలో పడిన 30 ఏళ్ల మహిళ చుట్టూ తిరుగుతుంది.